


శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:23



# పర్వత శిఖరంపై 'డ్రగ్స్‌కు నో' బ్యానర్

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:**

అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్ రెడ్డి మరో అరుదైన ఘనత సాధించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆలోచన మేరకు నిర్వహిస్తున్న యువశక్తి కార్యక్రమంలో భాగంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే సందేశాన్ని పర్వత శిఖరం నుంచి చాటిచెప్పారు.

మిగతా 2 లో




# సంస్కృతి సంప్రదాయాలు పండుగలు జరిపితే ఆక్రమణలా?

## - ఖాళీ స్థలాల్లో పండుగ సంబరాలు చేయకూడదా?

## - ఐదవ వార్డ్ మెంబర్ రోజా నాగేశ్వరరావు






**తంగళ్లపల్లి సెప్టెంబర్ 10శ్రీ (ప్రజా జ్యోతి)**

తంగళ్లపల్లి మండలం కెసిఆర్ నగర్ గ్రామ ప్రజలు పిల్లలు మహిళలు కలిసి జరుపుకునే పండుగలకు అడ్డుగా కొంతమంది కాంగ్రెస్ వారు అడ్డుగా నిలుస్తున్నారని కెసిఆర్ నగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు ప్రజలు ఏ పండుగలు గానీ ఏ సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకుంటే పండుగలకు అడ్డంకులుగా ఫ్లెక్సీలు కట్టతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు పండుగలు పబ్బాలు జరుపుకోవాలంటే కాంగ్రెస్ వారికీ నచ్చాదా?వీరి పరిపాలనలో ప్రజలు ఆనందంగా ఉండకూడదా?

మిగతా 2 లో

# అంగవైకల్యాన్ని జయించి.. వాస్తు రంగంలో ప్రత్యేక గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

**సుల్తానాబాద్: సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

అంగవైకల్యం తన విజయానికి అడ్డంకి కాదని నిరూపిస్తూ.. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో వాస్తు రంగంలో అంచలంచెలుగా ఎదిగి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు కాట్నపల్లి గ్రామానికి చెందిన వాస్తు ప్లానర్ పీవీ కృష్ణారావు. పుట్టుకతోనే సుమారు 90 శాతం అంగవైకల్యంతో ఉన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సాధించారు. తల్లి ప్రోత్సాహం, తనలోని పట్టుదలే తనను ఈ స్థాయికి తీసుకొచ్చాయని కృష్ణారావు తెలిపారు.పీవీ రాజ సౌజన్యరావు, అరవింద రత్నం దంపతుల మూడో కుమారుడైన కృష్ణారావు పుట్టుకతోనే అంగవైకల్యంతో జన్మించారు. దీంతో ఆయన భవిష్యత్తుపై ఆందోళన చెందిన కొందరు తల్లికి పలు సూచనలు చేసినా.. కుమారుడిని భారంగా భావించకుండా తల్లి అండగా నిలిచారు. చదువు నేర్పించి జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే ధైర్యాన్ని నూరిపోశారు. తాను అంగవైకల్యంతో ఉన్న విషయం అర్థం చేసుకునే వయసు వచ్చిన తర్వాత తల్లి చెప్పిన విషయాలు తనలో మరింత పట్టుదలను పెంచాయని కృష్ణారావు తెలిపారు.

## తల్లి ప్రోత్సాహంతో కొత్త అడుగు

జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే సంకల్పంతో వాస్తు ప్లానింగ్‌కు సంబంధించిన పుస్తకాలను సేకరించి అధ్యయనం చేయడం ప్రారంభించారు. వాటిని ఆసక్తిగా చదువుతూ వాస్తు ప్లానింగ్‌పై అవగాహన పెంచుకున్నారు. అనంతరం 2003 సెప్టెంబర్ 1న వాస్తు రంగంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మొదట్లో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ఒక్కో అడుగు ముందుకు వేశారు. తనపై నమ్మకంతో వచ్చిన వారికి వాస్తు ప్లానింగ్ అందిస్తూ క్రమంగా గుర్తింపు పొందారు.

## తొలి ప్లానింగ్ నుంచే సవాళ్లు

తాను అందించిన తొలి వాస్తు ప్లానింగ్‌లలో ఎదురైన అనుభవాలను కృష్ణారావు గుర్తుచేశారు. ఓ గ్రామంలో ఓ కుటుంబానికి చెందిన ఇంట్లో వాస్తు సరిగా లేదని, ఆ కుటుంబంలో ఇద్దరు కుమారులు మృతి చెందారని వారు తనను సంప్రదించినట్లు తెలిపారు. ఆ ఇంటికి వెళ్లవద్దని, ఏదైనా ప్రమాదం జరగవచ్చని కొందరు భయపెట్టినా.. తాను వాటిని పట్టించుకోకుండా ఇంటిని పరిశీలించి వాస్తు ప్లానింగ్ అందించినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆ కుటుంబం సంతోషంగా ఉందని తెలిపారు. ఇలాంటి అనుభవాలు తనపై నమ్మకాన్ని మరింత పెంచాయని పేర్కొన్నారు.

## వేలాది ఇళ్లకు వాస్తు ప్లానింగ్

ఇప్పటివరకు 3 వేలకుపైగా కొత్త ఇళ్లకు వాస్తు ప్లానింగ్‌లు, మరో 2 వేలకుపైగా పాత ఇళ్లకు రీ-వాస్తు ప్లానింగ్‌లు అందించినట్లు కృష్ణారావు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన పలు భవనాలు, నివాస గృహాలకు కూడా వాస్తు ప్లానింగ్ సేవలు అందించినట్లు పేర్కొన్నారు. కాట్నపల్లి గ్రామం నుంచి ప్రారంభమైన తన ప్రయాణం క్రమంగా సుల్తానాబాద్, పెద్దపల్లి దాటి ఇతర ప్రాంతాలకు విస్తరించిందన్నారు.

## నాలుగు అవార్డులు

వాస్తు రంగంలో అందించిన సేవలు, తన కృషికి గుర్తింపుగా కృష్ణారావుకు నాలుగు అవార్డులు లభించాయి. 2014లో సంఘమిత్ర బుక్ ఆఫ్ అవార్డు అందుకున్నారు. అనంతరం తెలంగాణ స్టేట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు, ఐకాన్ తెలుగు బుక్ రికార్డ్స్ అవార్డు సొంతం చేసుకున్నారు. తాజాగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో కలం గోల్డెన్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు అందుకున్నారు. కాట్నపల్లి వంటి గ్రామం నుంచి ప్రారంభమైన తన ప్రస్థానం చెన్నై వరకు గుర్తింపు పొందడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

## తల్లే తన విజయానికి స్ఫూర్తి

తన జీవితంలో తల్లి అరవింద రత్నం పాత్ర ఎంతో కీలకమని కృష్ణారావు తెలిపారు. పుట్టుకతో వచ్చిన అంగవైకల్యాన్ని చూసి నిరాశ చెందకుండా తనను చదివించి, జీవితంలో ఎదగాలనే ధైర్యం ఇచ్చారని చెప్పారు. తల్లి ప్రోత్సాహం లేకపోతే తాను ఈ స్థాయికి చేరుకునేవాడిని కాదన్నారు. తన విజయాలన్నింటినీ తల్లికి అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రెండు ప్రాంతాల్లో కార్యాలయాలు

ప్రస్తుతం సుల్తానాబాద్ పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో 'కృష్ణ సాయి గృహ వాస్తు ప్లానర్స్' కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి ఆదర్శనగర్ వద్ద మరో కార్యాలయం ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి వాస్తు ప్లానింగ్ అవసరమైనా తమను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 99494 23879, 90001 89369.

# దళితులను అవమానించడంపై నల్ల బ్యాడ్జీలతో నిరసన

**ధర్మారం,సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ఎదుట చావు డప్పు కొట్టిన దళితులను అవమానించేలా, డప్పు కొట్టిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆరోపిస్తూ గురువారం ధర్మారం మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ....దళితులను కించపరిచేలా వ్యవహరించడం తీవ్రంగా బాధాకరమని అన్నారు. సామాజికంగా వివక్షకు తావిచ్చే చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.దళితుల గౌరవం, హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. సంబంధిత ఘటనపై ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలోకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రూప్లా నాయక్, డిసిసిబి ప్రధాన కార్యదర్శి గాగీరెడ్డి తిరుపతి రెడ్డి,కార్యదర్శి కొత్త నరసింహులు,చింతల ప్రదీప్ రెడ్డి,కాడే సూర్యనారాయణ,దేవి జనార్ధన్,పాలకుర్తి రాజేశం,దేవి లావణ్య,వివిధ గ్రామాల సర్పంచులు, దళిత సంఘాల నాయకులు,కార్యకర్తలు, స్థానికులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు.



# పర్వత శిఖరంపై 'డ్రగ్స్‌కు నో' బ్యానర్

మొదటిపేజీ తరువాయి

సముద్ర మట్టానికి సుమారు 5,819 మీటర్ల ఎత్తులో ఉన్న రుద్రగైర పర్వత శిఖరాన్ని మహిపాల్ రెడ్డి విజయవంతంగా అధిరోహించారు. సెప్టెంబర్ 9వ తేదీ అర్ధరాత్రి సమిట్ క్యాంప్ నుంచి బయలుదేరి ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ శిఖరాన్ని చేరుకున్నారు. ఈ సందర్భంగా పర్వత శిఖరంపై 'హాశ్ చీూ ూూ ఙ=ఖ+ూ' అనే బ్యానర్‌ను ప్రదర్శించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, లక్ష్యసాధనతో కూడిన జీవితాన్ని ఎంచుకోవాలనే సందేశాన్ని సమాజానికి అందించేందుకు ఈ బ్యానర్‌ను ప్రదర్శించినట్లు తెలిపారు. గతంలోనూ తాను అధిరోహించిన పలు పర్వత శిఖరాలపై మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన బ్యానర్లను ప్రదర్శిస్తూ వచ్చానని మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సాహసంతో పాటు యువతలో సామాజిక చైతన్యం తీసుకురావాలనే తన సంకల్పాన్ని మరోసారి చాటిచెప్పారు.

# సంస్కృతి సంప్రదాయాలు పండుగలు జరిపితే ఆక్రమణలా?

మొదటిపేజీ తరువాయి

ఫ్లెక్సీ కట్టిన స్థలంలో ఎటువంటి అక్రమ కట్టడాలు జరగలేదని జనవరి నుండి డిసెంబర్ వరకు వచ్చే పండుగలు ఇంకా ఇతర కార్యక్రమాల ఖాళీ స్థలంలో ప్రజలు జరుపుకుంటున్నారని గత నాలుగు సంవత్సరాల నుండి





సంక్రాంతి పండుగ మొదలుకొని శివరాత్రి, హోలీ, మహిళా దినోత్సవం, శ్రీకృష్ణ జన్మాష్టమి స్వాతంత్ర దినోత్సవము, వినాయక చవితి బతుకమ్మ దసరా దీపావళి గణతంత్ర దినోత్సవం వివిధ పండుగలు పెళ్లిళ్ల ఫంక్షన్లు మొదలగునవి జరుపుకోవడం జరుగుతుందని ఫ్లెక్సీ ని ఇక్కడే కట్టి పండుగలు జరుపుకోకుండా చేస్తున్నారని అన్నారు ఖాళీ స్థలంలో పండగలు జరుపుకుంటున్న సమయంలో కరెంటును తొలగించడం ప్రజలను అవమానించడమే అని అన్నారు




# గడ్డి మందు నిషేధం... అమలు ఎక్కడ..?

- టాస్క్‌ఫోర్స్ దాడిలో 524 బాటిళ్లు సీజ్
- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు... దుకాణ యజమానిపై చర్యలు ఎక్కడ..?
- 60 రోజుల నిషేధం ముగిసినా స్పష్టత ఎందుకు లేదు..?
- నిషేధిత మందు విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ ఏదీ..?

**- దొమ్మటి రాజేష్...**



**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి:**
నిషేధిత గడ్డి మందు విక్రయాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది... వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు... టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి... కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో ఏకంగా 524 బాటిళ్ల నిషేధిత పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందు పట్టుబడటం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. టాస్క్‌ఫోర్స్ అధికారులు మందును స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినప్పటికీ... సంబంధిత దుకాణ యజమానిపై కేసు ఎందుకు నమోదు కాలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు నిషేధం ఉందని అధికారులు చెబుతుండగా... మరోవైపు నిషేధం అమలుపై స్పష్టత లేదని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటుండటంతో అసలు గడ్డి మందుపై నిషేధం ఉన్నట్టా... లేనట్టా..? అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

### టాస్క్‌ఫోర్స్ దాడిలో 524 బాటిళ్లు

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలోని శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీ ఎరువుల దుకాణంలో ఈ నెల 4న టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించిన 524 బాటిళ్ల పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. వాటిని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగించేందుకు ప్రయత్నించగా, వారు స్వీకరించకపోవడంతో చివరకు పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.
నిషేధిత గడ్డి మందు నిల్వలు గుర్తించి స్వాధీనం చేసుకున్నప్పటికీ... ఆ మందు విక్రయించేందుకు ఉద్దేశించారా? నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధమా? అన్న అంశాలపై అధికారులు తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### నిషేధం ఎప్పటి నుంచి... ఎంతకాలం..?

పారాక్వాట్ డైక్లోరైడ్ గడ్డి మందు పర్యావరణానికి హానికరంగా ఉండటంతో పాటు, దీనిని తాగడం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 60 రోజుల పాటు ఈ గడ్డి మందు వినియోగంపై నిషేధం విధిస్తూ మార్చి 31న ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఈ మందును నిషేధించాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు పేర్కొంటున్నారు. అయితే 60 రోజుల నిషేధ కాలం మే 31తో ముగిసింది. ఆ తర్వాత ఈ మందు విక్రయాలు, నిల్వలు, వినియోగంపై ప్రస్తుతానికి అమల్లో ఉన్న నిబంధనలు ఏమిటన్న విషయంలో క్షేత్రస్థాయిలో అధికారులకే స్పష్టత లేకపోవడం గమనార్హం.

### 60 రోజుల గడువు ముగిసింది... మరి ప్రస్తుత పరిస్థితి ఏమిటి..?

ప్రభుత్వం విధించిన 60 రోజుల నిషేధ గడువు ముగిసి నెలలు గడుస్తున్నా... పారాక్వాట్ డైక్లోరైడ్‌పై తుది నిర్ణయం ఏమిటన్నది స్పష్టంగా తెలియకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిషేధం పూర్తిగా కొనసాగుతుందా? గడువు ముగిసిన తర్వాత విక్రయాలకు అనుమతి ఉందా? నిల్వ ఉంచడంపై నిబంధనలు ఏమిటి? అన్న విషయాల్లో స్పష్టమైన మార్గదర్శకాలు క్షేత్రస్థాయి సిబ్బందికి అందాయా? అన్నదీ చర్చనీయాంశంగా మారింది.

### దుకాణంలోకి 524 బాటిళ్లు ఎలా వచ్చాయి..?

నిషేధిత గడ్డి మందు విక్రయాలు, నిల్వలపై వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు చెబుతున్న నేపథ్యంలో ఒక ఎరువుల దుకాణంలో 524 బాటిళ్ల భారీ నిల్వ బయటపడటం అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ప్రభుత్వం నిషేధించిన మందు అయితే దుకాణంలో అంత పెద్ద మొత్తంలో ఎలా నిల్వ ఉంది? నిషేధం ముగిసిపోయి ఉంటే దానిని అక్రమ నిల్వగా ఎందుకు పేర్కొన్నారు? నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

### కంపెనీకి తిరిగి పంపేందుకు సిద్ధంగా ఉన్నానంటున్న యజమాని

ఈ వ్యవహారంపై దుకాణ యజమాని శ్రీనివాస్ తన వాదనను అధికారులకు వివరించినట్లు సమాచారం. గత జనవరిలో ఓ కంపెనీ ద్వారా సుమారు 950 లీటర్ల గడ్డి మందును కొనుగోలు చేసి తెప్పించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో అందులో నుంచి 426 బాటిళ్లను తిరిగి కంపెనీకి పంపించినట్లు పేర్కొన్నారు. మిగిలిన నిల్వను కూడా కంపెనీకి తిరిగి పంపించేందుకు సమాచారం ఇచ్చానని, ఇదే సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకున్నారని ఆయన అధికారులకు వివరించినట్లు తెలుస్తోంది.

### షోకాజ్ నోటీసులు జారీ

ఈ వ్యవహారంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ... పొత్కపల్లి గ్రామంలోని శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీలో ఈ నెల 4న టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి 524 నిషేధిత గడ్డి మందు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు అందించిన నివేదిక ఆధారంగా ఈ నెల 7న దుకాణ యజమాని శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. నిషేధానికి సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన ముసాయిదా ఉత్తర్వులపై శాఖాపరంగా ఇంకా పూర్తి



స్పష్టత లేదని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### పోలీస్‌స్టేషన్‌లో మందు... కేసు మాత్రం ఎందుకు లేదు..?

టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న 524 బాటిళ్లను పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినప్పటికీ... ఇప్పటివరకు సంబంధిత దుకాణ యజమానిపై కేసు నమోదు కాలేదని పోలీసు అధికారులు చెబుతున్నారు. నిషేధిత మందు అని గుర్తించి స్వాధీనం చేసుకున్నప్పుడు... దాని నిల్వ, కొనుగోలు, విక్రయానికి సంబంధించిన నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనే అంశంపై పూర్తిస్థాయి విచారణ జరగాల్సి ఉంది. అయితే వ్యవసాయ శాఖ నుంచి స్పష్టమైన నివేదిక లేదా నిబంధనలపై స్పష్టత వచ్చిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

### రైతుల ప్రాణాలతో ముడిపడిన అంశం

పారాక్వాట్ డైక్లోరైడ్ వంటి గడ్డి మందుల విషయంలో వ్యవహారం కేవలం వ్యాపార నిబంధనలకే పరిమితం కాదు. వ్యవసాయంలో వినియోగించే రసాయనాల భద్రత, పర్యావరణ పరిరక్షణ, మానవ ప్రాణాల రక్షణతో ముడిపడి ఉన్న అంశం. అందుకే ప్రభుత్వం నిషేధం విధిస్తే దానిని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంటుంది. అదే సమయంలో నిషేధ కాలం ముగిసిన తర్వాత కూడా విక్రయాలు, నిల్వలు, రవాణాపై ఏ నిబంధనలు అమల్లో ఉన్నాయో స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే వ్యాపారులు, రైతులు, అధికారుల మధ్య అయోమయం నెలకొనే అవకాశం ఉంది.

### అసలు తప్పు ఎవరిది..?

ఒకవైపు నిషేధిత గడ్డి మందు అంటూ టాస్క్‌ఫోర్స్ అధికారులు 524 బాటిళ్లను పట్టుకున్నారు. మరోవైపు నిషేధంపై ఇంకా పూర్తి స్పష్టత లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

# నూతన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు దుద్దెడ భానుకు ఘన సన్మానం

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దుద్దెడ భానును ముస్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంపల్లి శ్రీనివాస్, కొండాపూర్ మాజీ సర్పంచ్ కర్ణాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీటీ నరసింహులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకుడు బాబు, ఏఎంసీ డైరెక్టర్ మామిళ్ల శ్రీకాంత్, మంద కిషన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన దుద్దెడ భానుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.



# వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

- అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు
- కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ హెచ్చరిక

**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని,అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ హెచ్చరించారు.గురువారం కొత్తపల్లి మండలంలోని డీజేలు,సౌండ్ బాక్సులు నిర్వహించే నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా అధిక శబ్దంతో డీజేలు,సౌండ్ బాక్సులు వినియోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.నిమజ్జనం ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా,అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మండలంలోని డీజేలు,సౌండ్ బాక్సుల నిర్వాహకులందరినీ ఎమ్మార్వో సమక్షంలో బాండ్ ఓవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



# సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## - బీజేపీ ముస్తాబాద్ మండల శాఖ ప్రధాన డిమాండ్లు

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10: (ప్రజా జ్యోతి):**



సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ ముస్తాబాద్ మండల శాఖ డిమాండ్ చేసింది.బీజేపీ ప్రధాన డిమాండ్లు ఇవే..1. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 17న జాతీయ జెండాను అధికారికంగా ఆవిష్కరించాలి.2. తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలి.3. పాఠశాలలు, కళాశాలల్లో తెలంగాణ విమోచన చరిత్రపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలి.4. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి.2 ఈ డిమాండ్లతో బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిజాం, రజాకార్ల నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిన చారిత్రక రోజుగా సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. విమోచన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చరిత్రను భావితరాలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎడునూరి గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మెరుగు అంజాగౌడ్, ఆవునూర్ సర్పంచ్ నక్కదాసరి రవీందర్, ఉప సర్పంచులు కోలా కృష్ణ, దగ్గు నవీన్, ఉపాధ్యక్షులు తిరుపతి, చికోటి మహేష్, కాసోడి రమేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, కుడుకల జనార్దన్, మహేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు గూడ బాల్‌రెడ్డి, కట్కం మహేష్, మీస స్వామి, కాసరవు రవి, మామిండ్ల భిక్షపతి, హర్షవర్ధన్, యాదగిరి, శ్యామ్, ప్రణవ్, సాయి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళితులు నడిచిన ప్రజా రహదారిని "అపవిత్రమైంది" అంటూ శుద్ధి చేసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

## - బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**



దళితులు నడిచిన ప్రజా రహదారిని "మైలైంది/అపవిత్రమైంది" అంటూ పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.2026 సెప్టెంబర్ 7న ఎర్రవెల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్ వైపు షెడ్యూల్డ్ కాస్ట్ సమాజానికి చెందిన పలువురు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం, దళితులు నడిచినట్లు పేర్కొంటున్న ప్రజా రహదారి/ప్రాంతాన్ని కొంతమంది వ్యక్తులు "మైలైంది/అపవిత్రమైంది" అనే భావనతో పసుపు నీటిని చల్లి శుద్ధి చేసినట్లు వీడియోలు, ఫొటోలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న సమాచారంతో తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.ఈ ఆరోపణలు వాస్తవమైతే, కుల ప్రాతిపదికన దళితులు నడిచిన ప్రాంతాన్ని అపవిత్రంగా పరిగణించి శుద్ధి చేయడం తీవ్రమైన కుల వివక్షకు సంబంధించిన చర్యగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతో పాటు, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు, అంటరానితనం నిర్మూలన స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటాయని అన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి పసుపు నీటిని చల్లి శుద్ధి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను గుర్తించాలని, ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరి పాత్రను విచారించాలని కోరారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన, నిర్వహించిన, ప్రోత్సహించిన లేదా సహకరించిన వ్యక్తులను కూడా గుర్తించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, సామాజిక మాధ్యమ పోస్టులు, సందేశాలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను సేకరించి భద్రపరచాలని, అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాలను పరిశీలించాలని కోరారు. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి, శుద్ధీకరణ కార్యక్రమానికి ఎవరైనా ఆదేశాలు ఇచ్చారా, సహకరించారా లేదా ప్రోత్సహించారా అనే అంశాలపై కూడా సమగ్రంగా దర్యాప్తు చేయాలని తెలిపారు.దర్యాప్తులో లభించే ఆధారాలు, ప్రతి వ్యక్తి పాత్ర, ఘటనకు వర్తించే చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1955, భారతీయ న్యాయ సంహిత, 2023తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధిస్తుందని గుర్తుచేస్తూ, దళితులు నడిచిన ప్రజా రహదారిని కుల ప్రాతిపదికన అపవిత్రంగా భావించి పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో వాస్తవమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను భద్రపరచడంతో పాటు బాధితులు, సాక్షులకు ఎలాంటి ఇబ్బందులు లేదా ఒత్తిళ్లు కలగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యారటి కరుణాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు దుద్దెడ భాను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల బుచ్చయ్య, కాంగ్రెస్ నాయకులు మామిళ్ల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చాకలి బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డుల పంట..

## - అభినందించిన చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**




విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ.. వారి ప్రతిభను వెలికి తీయడంలో విశేష కృషి చేస్తున్న ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు. పెద్దపల్లి జిల్లా ట్రాస్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నవ్య, విజయ, అక్షరలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ట్రాస్మ జిల్లా నాయకుల చేతుల మీదుగా వారికి పురస్కారాలు అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయడంతోపాటు.. వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయడం వంటి సేవలను గుర్తించి వీరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయుల కృషికి లభించిన ఈ గుర్తింపు విద్యారంగంలో వారు అందిస్తున్న సేవలకు నిదర్శనమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న నవ్య, విజయ, అక్షరలను ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఉపాధ్యాయుల ప్రతిభకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని.. ఇదే స్ఫూర్తితో మరింత అంకితభావంతో పనిచేసి విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని ఆకాంక్షించారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా అన్నపూర్ణ ఫౌండేషన్‌కు విరాళం

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గూడెం గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో అన్నపూర్ణ ఫౌండేషన్‌కు 15 లీటర్ల వంట నూనెను విరాళంగా అందజేశారు. సమాజ సేవలో భాగంగా నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు అన్నపూర్ణ ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు తమ వంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు రజక సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమానికి సహకరించిన గూడెం రజక సంఘం సభ్యులకు ఫౌండేషన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



# పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తి

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):**

కుమారుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఓ కుటుంబం సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచింది. మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన కైర రమేష్ తన కుమారుడు విరహన్ష్ బిట్టు జన్మదినం సందర్భంగా గురువారం కనుకుల శివాలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి సుమారు రూ.16 వేలతో తయారు చేయించిన రాతి ద్వారాన్ని వితరణగా అందజేశారు. అలాగే సుల్తానాబాద్‌లోని వికాస దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు కూరగాయల అన్నం, చికెన్, అరటిపండ్లు, మిఠాయిలతో భోజనం వడ్డించారు. పుట్టిన రోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని పలువురు రమేష్ కుటుంబాన్ని అభినందించారు.



# చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా శక్తికి, బహుజన ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, ప్రజలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళలు సామాజిక అన్యాయాలను ఎదుర్కొని తమ హక్కుల కోసం పోరాడేందుకు ఐలమ్మ జీవితం మార్గదర్శకమని తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం, బహుజనుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# గూడెం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ముస్తాబాద్ సెప్టెంబర్ 10: (ప్రజా జ్యోతి):**

గూడెం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్, ఉప సర్పంచ్ దగ్గు నవీన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సడిమెల బాలయ్య, జిల్లా కార్యదర్శి లింగంపల్లి ఎల్లా గౌడ్, కొప్పు భాగ్య, పులి విజయ్, వార్డు సభ్యులు కస్తూరి అంజయ్య, మాజీ ఎంపీటీసీ బోప్ప శ్రీధర్, మాజీ సర్పంచ్ చిట్నేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో 80 ఎకరాల్లో ఆయిల్‌పామ్ నాట్లు

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:**

పెద్దపల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహించేందుకు చేపట్టిన మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా గురువారం జిల్లాలో 80 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కల నాట్లు చేపట్టారు. గట్టు సింగారం గ్రామంలో రైతు దుగ్గెంపూడి రవీందర్ రెడ్డికి చెందిన 20 ఎకరాల పొలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ నీటి కొరత నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగిస్తూ దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందేందుకు ఆయిల్‌పామ్ సాగు మంచి ప్రత్యామ్నాయమన్నారు. ప్రభుత్వం మొక్కలు, బిందు సేద్యం, అంతర పంటలు, తోట నిర్వహణకు రాయితీలతో పాటు సాంకేతిక సహాయం అందిస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుమల ఆయిల్‌కెమ్ కంపెనీ సీఈఓ కేశు కళ్యాణ్కర్, ఉద్యాన శాఖ అధికారి ఎస్. మహేష్, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## రాచర్ల బాకూరుపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి**

ఎల్లారెడ్డిపేట మండలంలోనిరాచర్ల బాకూరుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురు వారం సీఎంఆర్ఎఫ్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మరుపాక రాజు మరియు మ్యాకల రాజమల్లవ్వలకు ముఖ్యమంత్రి సహాయ ని సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అవసరంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.



## 8వ వార్డులో యూనిఫాంల పంపిణీ.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**సుల్తానాబాద్ సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి)**

మున్సిపాలిటీ 8వ వార్డులోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల యూనిఫాంలను గురువారం స్థానిక కౌన్సిలర్ చింతల రాజు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం, పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసు కున్నారు.అదే వార్డులోని మార్కండేయ కాలనీలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించింది. కౌన్సిలర్ చింతల రాజు సమస్యను ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లగా, విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో విద్యుత్ అధికారులు రామస్వామి, కిషోర్, శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.






## 11న పెద్దపల్లిలో స్వర్ణోత్సవాల సన్నాహక సమావేశం

**పెద్దపల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:**



ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాల సభ నిర్వహణకు జాతీయ, రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయని సంఘం నాయకులు తెలిపారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా అధ్యక్షులు లంక సదయ్య మాట్లాడుతూ స్వర్ణోత్సవాల నిర్వహణలో భాగంగా ఈనెల 11న శుక్రవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని సంఘం జిల్లా, మండల కమిటీల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్, పాల రాజేశం, జిల్లా కో-కన్వీనర్లు ఆకునూరి బాల, అంకుష్, శనిగరపు పోచన్న, ఆలయ ఫౌండేషన్ అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు సరికాదు

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసినట్లు వెలువడిన వార్తలను ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవునూరి సతీష్ మహారాజ్ తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, విమర్శలు వేర్వేరుగా ఉన్నప్పటికీ అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటం సమర్థనీయం కాదన్నారు.పార్టీ, నాయకుడు ఎవరైనా అణగారిన వర్గాల ప్రజాప్రతినిధులను అవమానిస్తే ధర్మ సమాజ్ పార్టీ ప్రశ్నిస్తుందని స్పష్టం చేశారు. ఇది ఏ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కాదని.. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం చేస్తున్న ప్రకటన అని తెలిపారు. డా. బీఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం కల్పించిన సమానత్వం, గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అణగారిన వర్గాలపై అవమానకర వ్యాఖ్యలను సహించేది లేదని సతీష్ మహారాజ్ హెచ్చరించారు.



## 6వ వార్డులో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

### - ఎస్ఐఆర్- 2 పై కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ యాదవ్ పర్యవేక్షణ

**సుల్తానాబాద్ సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

మున్సిపాలిటీ 6వ వార్డులోని ఎంఎంపీఎస్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ యూనిఫాంలను 6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, సమస్య లను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే వార్డులో ఎస్ఐఆర్-2 ప్రక్రియను పర్యవేక్షించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో దేవేందర్‌కుమార్, అరేపల్లి కిరణ్, అరేపల్లి శ్రీను, అరేపల్లి హేమన్‌రాజ్, కోట రాకేష్, కొండ్ర వినయ్, కొండ్ర ప్రణయ్, మామిడిపల్లి శ్రీకాంత్, స్టాలిన్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాధవి, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, ఉపాధ్యాయులు సతీష్, సరోజిని తదితరులు పాల్గొన్నారు.





## ఎల్లారెడ్డిపేట ప్రెస్ క్లబ్ ఏర్పాటు అధ్యక్షుడిగా బుగ్గా కృష్ణమూర్తి శర్మ

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి)**



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం రోజున పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి నూతన అధ్యక్షుని సీనియర్ పాత్రికేయుడు బుగ్గ కృష్ణమూర్తి చైర్మన్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా బండారి బాల్రెడ్డి శ్రీనివాసరాజు ఉపాధ్యక్షుడు కొల్లేరు కిషోర్ కుమార్ దుర్గం విజయబాబు ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు బాలరాజు యాదవ్ సంయుక్త కార్యదర్శి జగదీష్, కోశాధికార శ్రీ రామోజీ శేఖర్ గారవ సలహాదారులుగా ఎదు గట్ల ముత్తయ్య సిహెచ్ తిరుపతి గౌడ్ సామాజి ప్రవీణ్ సురేష్ యాదవ్ కందుకూరి రవి కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ మహేష్ చిత్రాలు ఎన్నికయ్యారు. పలువురు వీరిని అభినందించారు.

# 22ఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

## - ఎమ్మార్వోకు వినతి పత్రం సమర్పించిన బిజెపి నేతలు

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):-**

తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 22ఏ నిషేధిత భూములు జాబితా అక్రమాలు, అవకతవకలపై, వేలాది మంది రైతులు, భూ యజమానుల ఆస్తి హక్కులను కాలరాస్తున్న ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకొని,ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరీ సత్యం, మండల అధ్యక్షులు చింతం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రోజున ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి కార్యదర్శి చేపూరి సత్యం , చింతం శ్రీనివాస్ లు మండల బిజెపి శ్రేణులతో కలిసి ఎమ్మార్వో కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన భారీ అవకతవకలను కేవలం పరిపాలనా తప్పిదంగా కాకుండా,ఒక వ్యవస్థీకృత కుట్రగా పరిగణించి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.వేలాది మంది భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ భారీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ధరణి/భూభారతి పోర్టల్స్‌లో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు జరిగిన మార్పులు, చేర్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. మండల వారీగా 22ఏ భూముల వివరాలను, గ్రామం,సర్వే నంబర్ల వారీగా బహిర్గతం చేసి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు, పట్టా భూములను వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయడానికి ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చిన అధికారులు,మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని



డిమాండ్ చేశారు. సమస్యనుపరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా చేపూరి సత్యనారాయణ,బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్,కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు బోనాలమోహన్,గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,ఓ బి సి మోర్చ జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్, దుర్శేటి రమేష్,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,రామిడి మహేందర్ రెడ్డి,గాండ్ల రాము,బుర్ర శ్రీనివాస్ గౌడ్, జాడి రాజు,బండి స్వామి,బూరుగు శ్రీనివాస్ రెడ్డి,దళిత మోర్చ మండల అధ్యక్షుడు ఎల్కపల్లి స్వామి,కుమార్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా ప్రజల్లోకి బీజేపీ

## - సేవా సంకల్ప అభియాన్ సన్నాహక సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు

## - 22-ఏ భూముల సమస్యపై తహసీల్దార్‌కు మెమోరాండం

**ఇల్లందకుంట, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**





భారతీయ జనతా పార్టీ ఇల్లందకుంట మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి నేతృత్వంలో సేవా సంకల్ప అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు హాజరయ్యారు.పుప్పాల రఘు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ.. సేవే లక్ష్యంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఇల్లందకుంట మండలంలో సేవా సంకల్ప అభియాన్‌ను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

### 22-ఏ భూముల సమస్య పరిష్కరించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 22-ఏ నిషేధిత జాబితా సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. అర్హులైన పేద రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించకుండా కాలయాపన చేయడం వల్ల భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అర్హత ఉన్న భూములను అధికారులు వెంటనే పరిశీలించి 22-ఏ జాబితా నుంచి తొలగించి పేద రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇల్లందకుంట మండల తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు మెమోరాండం సమర్పించారు. అధికారులు స్పందించి భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు, కంకణాల రవీందర్ రెడ్డి, ఇంగ్లే ప్రభాకర్, కంకణాల సురేందర్ రెడ్డి, తాళ్ల లావణ్య, చింతల ఐలయ్య, గుడికందుల పావని, ఉప్పు దుర్గయ్య, సోమిడి సురేందర్, కొక్కుల దేవేందర్, తుపాకుల సతీష్, బండారి అమరేందర్, మురహరి గోపాల్, తాళ్ల పాపిరెడ్డి, మట్ట పవన్ రెడ్డి, జంగం సమ్మయ్య, గురుకుంట్ల సంజీవ్, వడ్లకొండ జలపతి, ఎలావేణి శ్రీధర్, దేవునూరి లచ్చన్న, చిట్ల శ్రీనివాస్, చీపతి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

**చొప్పదండి,సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

ఈనెల 12 వ తేదీ నుండి మంచిర్యాల్ లో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ ( సబ్ జూనియర్స్ అండర్ 15 ఇయర్స్) విభాగంలో పాల్గొనే కరీంనగర్ జిల్లా సాఫ్ట్ బాల్ జట్టు కు చొప్పదండి జెడ్పిహెచ్ఎస్ (బాలురు) విద్యార్థులు డి.యశ్వంత్( 9వ తరగతి )పి. శ్రీనాథ్ (ఎనిమిదవ తరగతి) ఎంపికైనట్లు హెచ్ఎం ఎండి.జలీల్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియం లో జరిగిన జిల్లా స్థాయి పోటీల లో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులను,శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె. కృష్ణ ను ప్రధానోపాధ్యాయులు ఎండి జలీల్, పాఠశాల ఉపా ధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

# బీఎస్పీ రాజన్న సిరిసిల్ల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల బహుజన్ సమాజ్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు కొమ్మాట అశోక్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు.ఈ సమావేశానికి అదిలాబాద్ జోన్1 చీఫ్ ఇంచార్జ్, నిషాని రామచంద్రం అడ్వకేట్ ముఖ్య అతిథిగా, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నిగందుల వెంకన్న విశిష్ట అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కాన్షిరాం చూపిన మార్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు కొమ్మాట అశోక్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీని కేవలం ఎన్నికల సమయంలో పనిచేసే పార్టీగా కాకుండా, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే శక్తిగా నిర్మించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు అన్నారు.కాన్షిరాం గారి రాజకీయ కార్యాచరణను ప్రతి కార్యకర్త అధ్యయనం చేసి, ఆయన చూపిన క్రమశిక్షణ, సంఘటిత శక్తి, నిరంతర ప్రజా సంబంధాలు, క్షేత్రస్థాయి పార్టీ నిర్మాణం వంటి అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు అదిలాబాద్ చీఫ్ జోన్ ఇన్చార్జ్ నిషాని రాంచంద్రం మాట్లాడుతూ .రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతి గ్రామం, ప్రతి సెక్టార్‌లో పార్టీ కమిటీలను క్రియాశీలం చేసి, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం చట్టబద్ధమైన ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.అలాగే మాన్యవర్ కాన్షిరాం వర్ధంతి సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, ఆయన ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు.పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలే పార్టీకి నిజమైన బలం. ప్రతి కార్యకర్త తన



ప్రాంతంలో కనీసం కొంతమంది ప్రజలను చైతన్యవంతులను చేసి, వారిని సంఘటిత శక్తిగా మార్చే దిశగా పనిచేయాలి. పార్టీ బలం నాయకుల్లో కాదని క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల్లో ఉంటుందని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుందుల వెంకన్న మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పార్టీ పునర్నిర్మాణాన్ని పటిష్టంగా చేపట్టి, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సెక్టార్, బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చదువుచైతన్యం సంఘటితం పోరాటం అనే మార్గంలో ముందుకు సాగుతూ, కాన్షిరాం కార్యాచరణను ఆదర్శంగా తీసుకుని బహుజన సమాజాన్ని రాజకీయంగా చైతన్యవంతం చేయాలి అని వెంకన్న పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంచికట్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి మహేష్, జిల్లా ఈసీ మెంబర్ వెంగల ఆంజనేయులు, సిరిసిల్ల అసెంబ్లీ ఇంచార్జ్‌లు గడ్డం మధుసూదన్, బోగ కనకయ్య, సిరిసిల్ల అసెంబ్లీ కార్యదర్శి నక్క విజయ్, మహిళా విభాగం నాయకురాలు బూర మమత, మాజీ నాయకులు దొబ్బల చిన్న నరేష్, దొబ్బల సుమలత, తుర్కపల్లి శీనన్న తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ప్రశాంతంగా నిర్వహించాలి
## పీస్ కమిటీ సమావేశంలో సీఐ పులి వెంకట్





**ఇల్లందకుంట, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఇల్లందకుంట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ సూచించారు. ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన ఆధ్వర్యంలో గురువారం శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ వర్గాల ప్రతినిధులు, మత పెద్దలు, స్థానిక ప్రముఖులు, పీస్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పండుగల సమయంలో ప్రజలంతా పరస్పర గౌరవంతో, మత సామరస్యాన్ని కాపాడుతూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పీస్ కమిటీ సభ్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు.

### సోషల్ మీడియాలో వదంతులను నమ్మొద్దు

సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే సందేశాలు, వదంతులను ఎవరూ నమ్మవద్దని సీఐ సూచించారు. వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియాలో ఏదైనా అభ్యంతరకరమైన లేదా ఉద్రిక్తతలకు దారితీసే సమాచారం కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

### అనుమానాస్పద కదలికలపై సమాచారం ఇవ్వాలి

ఏ ప్రాంతంలోనైనా చిన్నపాటి వివాదాలు, గొడవలకు దారితీసే పరిస్థితులు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ముందస్తు సమాచారం అందించడం ద్వారా సమస్యలను పెద్దవి కాకుండా నివారించవచ్చన్నారు.

### చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పులి వెంకట్ హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని కోరారు.పీస్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఇల్లందకుంట పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని, ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా పనిచేస్తామని హామీ ఇచ్చారు

# విద్యార్థుల్లో సమానత్వమే లక్ష్యం
## పల్లిమక్త స్కూల్లో యూనిఫామ్స్ పంపిణీ
## విద్యార్థుల్లో హర్షం

**కోనరావుపేట,సెప్టెంబర్.10 (ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తుల (యూనిఫామ్స్) పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్, చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫామ్స్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా స్నేహభావం, సమానత్వం పెంపొందించ డానికి ఏకరూప దుస్తులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తే గ్రామ భవిష్యత్తు అని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి,వార్డు సభ్యులు జాగిరి కిరణ్ గౌడ్ ,మోకనపల్లి బాలరాజు, చిద్రవేణి నరేష్, జిన్న అర్జున్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహణ

**కోనరావుపేట, సెప్టెంబర్.10 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ,ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, ఎక్కలదేవి జలంధర్, ఉపాధ్యక్షులు చింతల పరశురాములు,మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు తీగల జయశ్రీ,రవీందర్ గౌడ్,జింక వెంకటి, సుదగోని సాయి కృష్ణ, జిన్నా రమేష్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## షార్ట్ సర్క్యూట్ తో పూరిగుడిసె దగ్ధం

### - పేద కుటుంబం రోడ్డున

**కోనరావుపేట,సెప్టెంబర్.10 (ప్రజాజ్యోతి)**

కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. గురువారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది.గ్రామానికి చెందిన షైక్ హోలీ గోసిబి కి చెందిన పూరిగుడిసె షార్ట్ సర్క్యూట్ తో క్షణాల్లోనే కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న బట్టలు, బియ్యం, వంట సామాగ్రి, ఇతర గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి.దీంతో పేద కుటుంబం తీవ్రంగా నష్టపోయి రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరావర్శించారు.అధికారులు తక్షణమే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, బాధిత పేద కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం, నిత్యావసర సరకులు అందించాలని స్థానికులు కోరుతున్నారు.



## తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

### - తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజి





**కోనరావుపేట,సెప్టెంబర్.10(ప్రజాజ్యోతి)**

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ కోనరావుపేట బీజేపీ మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ,ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాలాజీ, మాట్లాడుతూ.. హైదరాబాద్ విమోచనలో కీలకపాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ కు హైదరాబాద్ లో భారీ "స్టాట్యూ ఆఫ్ లిబరేషన్ – తెలంగాణ" విగ్రహాన్ని నిర్మించాలని, హైదరాబాద్ లో తెలంగాణ విమోచన మ్యూజియం ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో విమోచన స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయాలని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ విమోచన చరిత్ర, అజ్ఞాత వీరుల అధికారిక జాబితాను చేర్చాలని డిమాండ్ చేశారు.అమరవీరుల త్యాగం, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా జరపాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు బైరిగోని సురేష్ గౌడ్, ఎక్కలదేవి జలందర్ యాదవ్, ఉపాధ్యక్షులు చింతల పరశురాములు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు తీగల జయశ్రీ, ఎస్టీ మోర్చా అధ్యక్షులు అజ్మీరా వినోద్, జిల్లా అధికార ప్రతినిధి సుధాగోని నిశ్చిత, సీనియర్ నాయకులు జింక వెంకటి, తీగల రవీందర్ గౌడ్, కిట్టు, తంగళ్లపెల్లి రాములు, గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నం మహేష్, చౌటుపల్లి వెంకటి, పిల్లి వెంకటేష్, బాలరాజు, వేల్పుల మహిపాల్, సుధాగోని సాయికృష్ణ, జిన్నా రమేష్, మోత్కుపల్లి ప్రశాంత్, అంకంపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిపాలెం సర్పంచ్‌పై దాడి అమానుషం

### - సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షురాలు పొన్నం సునీత అనిల్ గౌడ్



**తిమ్మాపూర్,సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామ సర్పంచ్ తాట్ల తిరుపతిపై దాడి దారుణమని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత అనిల్‌గౌడ్ అన్నారు. గ్రామ ప్రథమ పౌరుడిపై జరిగిన ఈ దాడిని స్థానిక సర్పంచ్‌ల ఫోరం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు, సద్విమర్శలు సహజమే. కానీ హింసాత్మక చర్యలు మాత్రం ఏమాత్రం ఆమోదయోగ్యం కావని పేర్కొన్నారు. ఈ దాడి ఒక వ్యక్తిపై దాడి కాదు. గ్రామ ప్రజాస్వామ్యం, చట్టపాలనపైనే దాడి. ఇలాంటి సంఘటనలు జరిగితే సామాన్య ప్రజలకు భద్రత ఎలా ఉంటుంది అనే ప్రశ్న మిగులుతుంది. తిమ్మాపూర్ మండల చరిత్రలోనే ఇది ఒక చీకటి రోజని అన్నారు.ఒక ఉన్నత పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న వ్యక్తిపై దాడి జరగడం అవమానకరం. ఇలాంటి చర్యలను మేము సహించబోము.దాడికి ప్రతి దాడి సమాధానం కాదు. చట్టబద్ధంగానే స్పందిస్తాం అని ఫోరం తరపున స్పష్టం చేశారు.ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేకవ్వం పల్లి సత్యనారాయణ స్పందించి, అధికారులతో సమన్వయం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు త్వరగా జరగాలి.లేనిపక్షంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులపై భయాందోళనలు పెరుగుతాయి.గ్రామాల్లో ప్రజాపాలన సక్రమంగా సాగాలంటే సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులకు భద్రత,గౌరవం అవసరమన్నారు.

## "జీవించి సాధించాలి"

### - ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కార్మికులకు గ్రూప్ కౌన్సెలింగ్..

### - సైకాలజిస్ట్ పున్నంచందర్ పిలుపు..



**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి న్యూస్:**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నెహ్రూనగర్‌లోని కార్మికులకు ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ ఆధ్వర్యంలో గురువారం గ్రూప్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని, సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఒంటరిగా భరించకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నిపుణులతో తమ ఆలోచనలు, భావాలను పంచుకోవాలని సూచించారు. ఆత్మహత్యల నివారణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచేందుకు "చేంజింగ్ ది నరేటివ్ ఆన్ సూసైడ్స్" అనే సందేశంతో ప్రజల్లో ఆత్మహత్యలపై ఉన్న ఆలోచనా విధానాన్ని మార్చాల్సిన అవసరం గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృతంగా చర్చించాలని కోరిందని అన్నారు. సమస్యల్లో ఉన్న వ్యక్తులతో మనస్ఫూర్తిగా మాట్లాడటం, వారి బాధను వినడం, అర్థం చేసుకోవడం, అవసరమైన సమయంలో తగిన కౌన్సెలింగ్, మానసిక సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఒక వ్యక్తి బాధను తీర్పు చెప్పకుండా ఓపికగా విని అర్థం చేసుకోవడం కూడా ఆత్మహత్యల నివారణలో ఒక ముఖ్యమైన అడుగు అని పున్నంచందర్ పేర్కొన్నారు. జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మహత్య పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు ఏదో ఒక మార్గంలో పరిష్కారం లభిస్తుందని, "జీవించి సాధించాలి" అనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కార్మికులకు సూచించారు. సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు మాట్లాడుతూ ఎటువంటి మానసిక లేదా కుటుంబ సమస్యలు ఎదురైనా వాటిని నిర్లక్ష్యం చేయకుండా మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ను సంప్రదించి అవసరమైన సహాయం పొందాలని కోరారు. ఆత్మహత్యల నివారణ కోసం మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు, మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రోలో శిక్షణకు సిరిసిల్ల యువకుడు

## - వీఎస్ఎస్‌సీలో సిరిగిరి తేజస్విన్ వర్మ ఎంపిక



**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి న్యూస్:**

అంతరిక్ష రంగంలో దేశానికి సేవలందిస్తున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో సిరిసిల్ల యువకుడు సిరిగిరి తేజస్విన్ వర్మ శిక్షణకు ఎంపికయ్యారు. ఇస్రోకు చెందిన ప్రతిష్ఠాత్మక విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ వీఎస్ఎస్ సి తిరువనంతపురంలో ఏరోస్పేస్ ఇంజనీర్గా గా ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు వీఎస్ఎస్‌సీ అధికారులు తేజస్విని వర్మకు ఆఫర్ లెటర్ అందజేశారు. చెన్నై ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన సిరిసిల్ల పట్టణానికి చెందిన తేజస్విని వర్మ చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్/ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విద్యను అభ్యసించారు. ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన అనంతరం ఏరోస్పేస్ రంగంలో తన ప్రతిభను చాటుకునే దిశగా ముందుకు సాగుతున్న ఆయనకు ఇస్రోలోని వీఎస్ఎస్‌సీలో శిక్షణకు ఎంపిక కావడం కీలకమైన మైలురాయిగా నిలిచింది.సిరిసిల్లకు చెందిన యువకుడు దేశంలోని ప్రతిష్ఠాత్మక అంతరిక్ష పరిశోధనా సంస్థలో శిక్షణకు ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. తేజస్విని వర్మ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి అంతరిక్ష రంగంలో దేశానికి సేవలందించాలని ఆకాంక్షించారు. యువతకు ఆయన ఎంపిక స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

# రహదారిపై నిద్రిస్తున్న సంచార జాతుల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## - పోలీస్ అండ్ మున్సిపల్ యంత్రాంగాలకు ప్రత్యేక ధన్యవాదాలు

**వేములవాడ,సెప్టెంబర్,10:ప్రజాజ్యోతి.**

వేములవాడ రెండో బైపాస్ రోడ్డుపై నిద్రిస్తూ ప్రమాదపుటంచున గడుపుతున్న సంచార జాతుల ప్రజల సమస్యపై అధికారులు తక్షణమే స్పందించారు. సుమారు 60 మంది చిన్నపిల్లలతో కలిపి ప్రధాన రహదారి ప్రక్కనే మంచాలు వేసుకుని నిద్రిస్తున్న దృశ్యాలపై కథనం టీవీ8లో వేయగానే కాగానే మున్సిపల్, పోలీస్ అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. భారత్ పెట్రోలియం సమీపంలో ఆవాసం ఏర్పాటు చేసుకున్న సంచార జాతుల కుటుంబాల వద్దకు అధికారులు చేరుకుని, రాత్రి వేళల్లో రోడ్డుపై నిద్రించడం వల్ల జరిగే ప్రాణనష్టం, ప్రమాద తీవ్రతను వారికి వివరించారు. అధికారులు వారికి నచ్చజెప్పి, రోడ్డుపై ఉన్న మంచాలను తొలగించి, ఆ కుటుంబాలను సమీపంలోని సురక్షితమైన ప్రదేశానికి తరలించారు. అనుకోని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా స్పందించి, తగిన చర్యలు చేపట్టిన మున్సిపల్, పోలీస్ అధికారులకు స్థానికులు, వాహనదారులు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై రహదారులపై ఎలాంటి ఆక్రమణలు, ప్రమాదకర నివాసాలు ఉండకుండా నిరంతరం నిఘా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు.







# బిజెపి పట్టణశాఖ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం

**వేములవాడ ,సెప్టెంబర్,10:ప్రజాజ్యోతి.**




వేములవాడ పట్టణం లోని పద్మశాలి భవన్లోఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం లో పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లా డుతూ రాష్ట్ర జిల్లా శాఖల ఆదేశాల మేరకు ప్రతినెల నిర్వహించాల్సిన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా చూస్తున్నాం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పదేళ్లు పాలన ఉండి ఏంచేయ లేనిబిఆర్ఎస్,పార్టీరెండుకూడా కుమ్మక్కై ప్రజల్ని పక్కదోవ ప ట్టించడానికిడ్రామాలాడుతున్నారని ఒకప్క శాసన సభ సమావే శాలు నడుస్తుంటే ఈ చిల్లర కా ర్యక్రమాలు ఏంటని అన్నారు... ప్రతాప రామకృష్ణమాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలు ఆలో చించి బిజెపి పార్టీని ఎంచుకునే రోజులు ముందు ఉన్నాయని అన్నారు రెండు పార్టీలు దొంగ నాటకాలతో సెప్టెంబర్ 17 రోజు విమోచన దినోత్సవాన్ని అధికా రికంగానిర్వహించలేకపోతున్నాయని అన్నారు మరో రెండేళ్లలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక అధి కారికంగా విమోచనదినోత్సవం నిర్వహిస్తామనిహితవుపలికారు... కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మార్వో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా ని ర్వహించేలా చర్యలు తీసుకో వాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రేగుల శ్రీకాంత్, పిన్నింటి. హనుమాన్లు గుడిసె మనోజ్ బిల్లా కృష్ణ కటకం శ్రీనివాస్ జవ్వాజి రాజశేఖర్ సాయి కృష్ణ అన్నం నరసయ్య రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపసర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా తిక్కల నవీన్ నియామకం

## - నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ.. ఉపసర్పంచుల సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేస్తా - తిక్కల నవీన్

**కోనరావుపేట,సెప్టెంబర్. 10(ప్రజాజ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపసర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన ఉపసర్పంచ్ యువ నాయకుడు తిక్కల నవీన్ నియమితులయ్యారు.ఈ మేరకు ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్, జిల్లా అధ్యక్షులు లక్ష్మీ రెడ్డి, ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఉపసర్పంచుల సమస్యలపై చురుగ్గా పనిచేస్తున్న నవీన్ ను ఈ పదవికి ఎంపిక చేశారు.ఈ సందర్భంగా తిక్కల నవీన్ మాట్లాడుతూ.. తన మీద నమ్మకం ఉంచి మరింత బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ రెడ్డి, కోనరావుపేట మండల అధ్యక్షులు రాజు ,కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, జిల్లాలోని ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉపసర్పంచులకు రావాల్సిన గౌరవం, హక్కుల కోసం ఫోరం తరపున పోరాడుతానని తెలిపారు.నవీన్, నియామకం పట్ల కోనరావుపేట మండల ఉపసర్పంచులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి )**

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం, గడీల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని ఆ మహనీయురాలు విగ్రహానికి శ్రీనివాస్ రెడ్డి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాల్వ మల్లేశం, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూస్వామ్య దోపిడీ, నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచి పేదలు, బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన తెగువ ఆదర్శనీయమని పేర్కొన్నారు.అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే సంకల్పం, సమాజ శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేయాలనే సందేశాన్ని చాకలి ఐలమ్మ జీవితం అందిస్తోందని శ్రీనివాస్ రెడ్డి అన్నారు.



## కనగర్తి విద్యార్థులకు ఉచిత ఐఐటి పుస్తకాలు టీచర్ ని ఏర్పాటు చేసిన ట్రస్ట్

### - విశ్వవిద్య ట్రస్ట్ చైర్మన్ కోచకంటి హరిశర్మ

**కోనరావుపేట,సెప్టెంబర్.10 (ప్రజాజ్యోతి)**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు సాంకేతిక విద్యలో కూడా ప్రావీణ్యం కలిగి ఉండాలని విశ్వవిద్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ కోచకంటి హరిశర్మ అన్నారు.కోనరావుపేట మండలం కనగర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఐటీకి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి దాటిన విద్యార్థులకు ఐఐటీ విద్య గురించి తెలియకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.పాఠశాల స్థాయి నుంచే వారికి ఐఐటి విద్యపై అవగాహన కల్పిస్తే ట్రిపుల్ ఐటీ, కళాశాల స్థాయిలో చదివినా ఇబ్బందులు ఏర్పడవన్నారు. అందుకోసమే పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఐఐటీ పుస్తకాలను ట్రస్ట్ ద్వారా తెప్పించి, బోధించడానికి టీచర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్యాల స్వామిదాస్, ఉపసర్పంచ్ వంగపెల్లి శేఖర్, హెచ్ఎం వినోద్ కుమార్, ట్రస్ట్ బాధ్యులు అనుపాటి భూంరెడ్డి, రావులపెల్లి గంగారెడ్డి, వంగపెల్లి నాగరాజు, శ్రీనివాస్, ఏపీపీ చైర్మన్ పుట్ట సంపూర్ణ, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వినాయక మండపాల నిర్వాహకులకు జాగ్రత్తలపై అవగాహన

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

ముస్తాబాద్ మండల కేంద్రంలో గురువారం వినాయక మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిరిసిల్ల జిల్లా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఎంపీడీఓ, ఎంఆర్వోలు ముఖ్య అతిథులుగా పాల్గొని వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు వివరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వినాయక చవితి నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, భక్తుల రద్దీ నియంత్రణ, చిన్నారులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని, ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అలాగే మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు. నిమజ్జనం సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో ముస్తాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చిగురు నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, వినాయక మండపాల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.




# క్యాన్సర్ చికిత్సలో మరో ముందడుగు

## - యశోద హైటెక్ సిటీలో ఇన్‌హౌస్ ఎన్‌జీఎస్ సదుపాయం ప్రారంభం

## - ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ శీ ఖర్ కుమార్

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 10( ప్రజాజ్యోతి )**

క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో ప్రెసిషన్ ఆంకాలజీకి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో ఇన్‌హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సదుపాయాన్ని ప్రారంభించింది. దీనివల్ల క్యాన్సర్ కణాల్లోని జన్యుపరమైన మార్పులను వేగంగా, ఖచ్చితంగా గుర్తించి.. రోగికి సరైన, వ్యక్తిగతీకరించిన చికిత్సను ఎంపిక చేసేందుకు వైద్యులకు మరింత సహకారం లభించనుంది.గురువారం నగరంలోని యశోద హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శీ ఖర్ కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో గతంలో ఉన్న 'అందరికీ ఒకే విధమైన చికిత్స' విధానం క్రమంగా మారుతోందన్నారు. రోగి క్యాన్సర్ జన్యు స్వభావాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా లక్ష్యిత చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. టార్గెటెడ్ థెరపీలు, ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్హిబిటర్స్ వంటి ఆధునిక చికిత్సలు అనేక క్యాన్సర్లలో రోగుల జీవనకాలం, జీవన నాణ్యతను మెరుగుపరుస్తున్నాయని వివరించారు.ఆస్పత్రిలోనే ఎన్‌జీఎస్ సదుపాయం అందుబాటులోకి రావడంతో జన్యుపరమైన మార్పులను త్వరగా గుర్తించే అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు ఇతర క్యాన్సర్లలోనూ చికిత్స నిర్ణయాలకు ఎన్‌జీఎస్ కీలకంగా




ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్సను ఎంపిక చేయడం ద్వారా ప్రెసిషన్ ఆంకాలజీ మరింత సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు.యశోద హైటెక్ సిటీలో మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందంతోపాటు రోబోటిక్ ఆంకోసర్జరీ, ఆధునిక రేడియేషన్ థెరపీ తదితర సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. ఇన్‌హౌస్ ఎన్‌జీఎస్ సదుపాయం ప్రారంభంతో ప్రెసిషన్ ఆంకాలజీ సేవల్లో మరో కీలక ముందడుగు పడిందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రోగి కేంద్రంగా క్యాన్సర్ చికిత్స అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవాల వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## - మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి






**మంథని, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

గణేష్ నవరాత్రి ఉత్సవాల వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి సూచించారు. మంథని పోలీస్ స్టేషన్ లో సీఐ తో కలిసి మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేశ విగ్రహాల ప్రతిష్ట నిర్వాహకులతో మంథని సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్ లు గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, ప్రతి బహిరంగ మండపం, బహిరంగ ఊరేగింపులో తప్పనిసరిగా పోలీస్ పోర్టల్ జూశీశ్రీ‌ఱవఎజూశీతీ‌్‌ఱశ్రీ.ఱఅ-శ్రీఱఎ.ప్రశీఙ.ఱఅ లో సమాచారం అందించాలన్నారు. అనుమతి పొందిన విద్యుత్ కనెక్షన్ మాత్రమే వాడాలని, హుకింగ్ (అనవసరమైన కనెక్షన్లు) అనుమతి లేదని, మండపం వద్ద అగ్ని ప్రమాదాల నుండి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మండపం లోపల కేవలం 2 బాక్స్-టైప్ స్పీకర్లు మాత్రమే వాడాలని, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు అనుమతి లేదని, కేవలం భజనలు మాత్రమే చేయాలని సూచించారు. 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, వారి పేర్లను ఒక పుస్తకంలో నమోదు చేయాలని, రికార్డింగ్, పవర్ బ్యాకప్‌తో కూడిన సిసిటివి కెమెరాలు ఉండాలన్నారు. రాజకీయ నినాదాలు, రాజకీయపరమైన పాటలు, మద్యం, లక్కీ డిప్, బలవంతపు వసూళ్లు చేయవద్దన్నారు. నోటీపై చేయబడిన స్థానిక చెరువులో మాత్రమే నిమజ్జనం చేయాలని, ఒక్కో విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతించబడుతుందని, వాహనంలో డీజే, స్పీకర్లు వాడటానికి అనుమతి లేదని, పోలీసులు సూచన ప్రకారం ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంథని తహసీల్దార్ అరిఫుద్దీన్, మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు హాజరయ్యారు.

# వేములవాడలో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు

- ఆందోళన వద్దు.. శాస్త్రీయ పద్ధతులతో ఎల్ నినోను ఎదుర్కొందాం: ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి
- రైతులకు సబ్సిడీ పథకాలు, యాంత్రీకరణపై అవగాహన
- పత్తి పంట పొలాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**వేములవాడ,సెప్టెంబర్,10:ప్రజాజ్యోతి.**





వేములవాడలోని మూడో వార్డు లక్ష్మీపురంలో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మ కమిటీ వేములవాడ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు హాజరయ్యారు. వీరితో పాటు టీఆర్వీకే జిల్లా కోఆర్డినేటర్ సాయి కుమార్, వేములవాడ ఎంఏఓ సాయి కిరణ్, వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు అంజయ్య, స్థానిక కౌన్సిలర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు పలు కీలకమైన విషయాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో వివరంగా వివరించారు. ముఖ్యంగా ప్రధాన పంటలైన వరి, పత్తి పంటల్లో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను, వివిధ రకాల చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను తెలియజేశారు. రసాయన ఎరువుల పరిమితి దాటిన వాడకం వల్ల నేల సారం దెబ్బతింటుందని హెచ్చరిస్తూ, యూరియాను సక్రమంగా వినియోగించాలని మరియు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడకం పెంచాల్సిన ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. వ్యవసాయంలో తీవ్రమవుతున్న కూలీల కొరతను అధిగమించడానికి యంత్రాల వినియోగం పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీ పథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సమావేశం ముగిసిన అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు క్షేత్రస్థాయిలో పత్తి పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. పంట ఎదుగుదల, చీడపీడల పరిస్థితిని పరిశీలించిన అనంతరం ముస్కు ముకుందరెడ్డి మాట్లాడారు.వాతావరణంలో అనూహ్యంగా వస్తున్న మార్పులు, ఎల్ నినో ప్రభావం పట్ల రైతాంగం ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముస్కు ముకుందరెడ్డి ధైర్యం చెప్పారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు అధైర్యపడకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలను క్రమం తప్పకుండా పాటించాలని కోరారు. రైతులు సాంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, శాస్త్రీయ సాగు విధానాలను అలవాటు చేసుకున్నప్పుడే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందన్నారు. యూరియాతో పోలిస్తే నానో యూరియా వినియోగం వల్ల పంటలకు ఎక్కువ మేలు జరుగుతుందని, ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. అలాగే వ్యవసాయ రంగంలో ప్రస్తుతం కూలీల లభ్యత తగ్గిపోతున్న దృష్ట్యా, రైతులు యంత్ర పరికరాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం అనేక రకాల యంత్రాలపై భారీ సబ్సిడీలను అందిస్తోందని, ఈ అవకాశాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని పిలుపునిచ్చారు. పంటల సాగులో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

---

## తెలంగాణ సాయుధ పోరాట నిప్పు రవ్వ చిట్యాల ఐలమ్మ

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య

**ఇల్లంతకుంటసెప్టెంబర్10(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ 41 వర్ధంతి వేడుకలు నిర్వహించి ఘన





నివాళి అర్పించారు ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ నాటి తెలంగాణలో పెత్తందారుల దేశ్ముకు భూస్వాముల ఆగడాలపై ఐలమ్మ ఎనలేని పోరాటం చేసిందని తన పంటను కాపాడుకోవడం కోసం నాటి కమ్యూనిస్టు నాయకులతో కలిసి దళాలు ఏర్పాటు చేసి గ్రామాల్లోకి పెత్తందారులు పంపే గుండాలను తరిమికొట్టారని ఆన్నారు నేటి యువత ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యలపై పోరాడాలని అన్నారులి ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు పర్సయ్య గ్రామ సర్పంచ్ గన్నేరు వసంతనర్సయ్య ఉపసర్పంచ్ ఎల్లవేణి రమేష్ మాజీ సర్పంచ్ జితేందర్ గౌడ్ నాయకులు మీసర గండ్ల అనిల్ కుమార్ వార్డు మెంబర్ ఎద్దు విజయ అశోక్ యాదవ్ కనకయ్య రజినీకాంత్ నర్సయ్య బాలయ్య చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

---

## ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రె అనిల్

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్పూర్ గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఉప సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికకు సహకరించిన ఉపసర్పంచ్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన అడిషనల్ డీసీపీ

**చొప్పదండి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో భాగంగా అడిషనల్ డీసీపీ (అడ్మిన్) పి. వెంకటరమణ గురువారం సందర్శించారు. స్టేషన్లో పలు కేసుల్లో పట్టుబడి ఉన్న వాహనాల వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు నిర్వహణ నమోదైన కేసుల వివరాలు సి సి టీఎన్ఎస్ లో పొందుపరచాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రజలు శాంతియుతంగా వినాయకుడి ఆగమన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. సిఐ ప్రదీప్ కుమార్, ఎస్సై నరేష్ రెడ్డి పాల్గొన్నారు.




# అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు మినీ టిప్పర్లు పట్టివేత

**వీణవంక, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి)**

వీణవంక మండల పరిధిలోని నర్సింగపూర్ గ్రామ పొలిమేరలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు మినీ టిప్పర్లను వీణవంక పోలీసులు పట్టుకున్నారు.అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు మినీ టిప్పర్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా మట్టి, ఇసుక తదితరాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అనుమతులు లేకుండా మైనింగ్, మట్టి తరలింపులకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.






# అన్యాయానికి ఎదురునిలిచిన ఐలమ్మ త్యాగం చిరస్మరణీయం

## మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- పెద్ద ఎత్తున పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

**వేములవాడ,సెప్టెంబర్,10:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి బస్టాండ్ వద్ద వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను గురువారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అయన మాట్లాడుతూ తెలంగాణ నేలపై అన్యాయానికి, భూస్వామ్య దౌర్జన్యాలకు ఎదురునిలిచి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం చిరస్మరణీయమని పుల్కం రాజు కొనియాడారు. అణగారిన వర్గాలు, పేదల హక్కుల రక్షణ కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె చూపిన ధైర్యసాహసాలు చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయని తెలిపారు. ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాట పటిమను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఐలమ్మ ఆశయ సాధనకు, సమాజంలో బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి



ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుం మధు, కాంగ్రెస్ నాయకులు చిలక రమేష్, కూరగాయల కొమురయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు తోట రాజు, ఇప్పపూల అజయ్, కొక్కుల బాలకృష్ణ, రామతీర్థపు హరీష్, కట్కూరి శ్రీనివాస్, పార్టీ నాయకులు పులి రాంబాబు గౌడ్, అరుణ్ తేజ చారి, గుమ్మడి రాజేశం, తాటికొండ వాణి, ఆడెపు మల్లేశం, మైలారం రాము, ముంజ ఉమేందర్, కాసారాపు తిరుపతి, రాజు, కుతాడి రాజేశంలతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, ఐలమ్మ అభిమానులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కృషితో ఆరు మాసాల క్రితమే రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు: చైర్మన్

- వేములవాడ మూడో వార్డులో ఘనంగా ఆత్మ రైతు అవగాహన సదస్సు

- ఎల్ నినో సవాళ్లను అధునాతన సాగు పద్ధతులతో ఎదుర్కొందాం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది- రసాయన ఎరువులు తగ్గించి నానో యూరియా వాడకం పెంచాలి






**వేములవాడ,సెప్టెంబర్,10:ప్రజాజ్యోతి.**

వేములవాడలోని మూడో వార్డు లక్ష్మీపురంలో ఆత్మ కమిటీ (ఆత్మ ) ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఆత్మ కమిటీ వేములవాడ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, టీఆర్వీకే జిల్లా కోఆర్డినేటర్ సాయి కుమార్, వేములవాడ ఎంఏఓ సాయి కిరణ్, వెటర్నరీ డాక్టర్ రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు అంజయ్య, స్థానిక కౌన్సిలర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు మరియు వేర్వేరు గ్రామాల నుంచి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల వ్యవసాయంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ముఖ్యంగా వరి, పత్తి పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలపై స్పష్టతనిచ్చారు. అలాగే రసాయన ఎరువుల అతి వినియోగాన్ని నియంత్రించి, నానో యూరియా వాడకాన్ని పెంచాలని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమావేశం ముగిసిన అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆత్మ చైర్మన్ ముస్కు ముకుందరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు క్షేత్రస్థాయికి వెళ్లి పత్తి పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. పంట ఎదుగుదల, చీడపీడల పరిస్థితిని పరిశీలించిన తర్వాత మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడారు. వాతావరణంలో సంభవిస్తున్న అన్యాకుల మార్పులు, ఎల్ నినో ప్రభావం పట్ల రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు భరోసా ఇచ్చారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా రైతాంగం లాభసాటి సాగు వైపు సాగేందుకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిరంతరం అందుబాటులో ఉంటారని, వారి సలహాలు క్రమం తప్పకుండా పాటించాలని కోరారు. సంప్రదాయ వ్యవసాయానికే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతికతను, శాస్త్రీయ విధానాలను అలవాటు చేసుకున్నప్పుడే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించగలరని స్పష్టం చేశారు. వేములవాడలో ఆరు మాసాల క్రితమే స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి రసాయన ఎరువులను తగ్గించి, నానో యూరియాను వాడటం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా పంటకు మేలు జరుగుతుందని వివరించారు. వ్యవసాయ రంగంలో రోజురోజుకూ పెరుగుతున్న కూలీల కొరతను అధిగమించడానికి యంత్రాల వినియోగం అత్యంత ఆవశ్యకమని, ప్రభుత్వం అందిస్తున్న యంత్రాల సబ్సిడీ పథకాలను రైతులందరూ పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముస్తాబాద్‌లో మండల స్థాయి సమీక్ష సమావేశం

**ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

ముస్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల పనితీరు, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు వివరాలను సమర్పించారు. గ్రామాల వారీగా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని స్పెషల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సూచించారు. గ్రామాల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని



సమావేశంలో చర్చించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆఫ్రా, ఎంపీడీఓ లచ్చాలు, ఆత్మ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజణితో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## మంథని కాంగ్రెస్ పార్టీ నేతలు

**మంథని, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

మంథని లోని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు క్యాంపు కార్యాలయం లో చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) వర్ధంతి సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళు లర్పించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టి.పి.సి.సి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు సూచన మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, తెలంగాణ వీర వనిత మన చాకలి ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ ధైర్యం, ఆత్మ గౌరవం, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. తన భూమి కోసం మాత్రమే కాకుండా, తనలాంటి ఎంతోమంది పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె పోరాడారు, అన్యాయం ఎంత పెద్దదైనా, దాని ముందు మన ధైర్యం మరింత పెద్దదిగా ఉండాలి అనే స్ఫూర్తిని తన జీవితంతో చూపించారని అన్నారు. సామాజిక అన్యాయం, దోపిడి, అనచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి



కోసం నాటి నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయురాలని అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మ గౌరవాన్ని మరింత బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మ గౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని, ఆమె త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దళితులు ధర్నా చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడమా?

## - దళితులనుఅవమానించడంపై పోలీసులకుఫిర్యాదు

## - వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు

**వేములవాడ,సెప్టెంబర్,10:ప్రజాజ్యోతి.**

రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత బిడ్డను అవమానించిన ఘటనపై పశ్చాత్తాపం వ్యక్తం చేయాల్సిందిపోయి.. ఫామ్‌హౌస్‌కు సమీపంలో దళితులు ధర్నా చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అత్యంత హేయమైన చర్య అని వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటనను ఖండిస్తూ గురువారం వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ రూరల్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దళితులను అవమానించేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో కుల వివక్షకు తావులేదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రొండి రాజు కోరారు. ఈ కార్యక్రమంలో. రూరల్ మండలాధ్యక్షుడు. సోయనేని




కర్ణాకర్. జిల్లా ాయకులు. వకులభరణం శ్రీనివాస్. ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎడపల్లి అనిల్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు. రోమాల ప్రవీణ్కుమార్. నేదూరి రమేష్, సామల్ల రాజు,రాకేష్. వంగపెల్లి మల్లేశం. తదితరులు ఉన్నాయి.

# కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా ఎండి అంకుస్

**తిమ్మాపూర్,సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ నియామకం మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ రెడ్డి స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్ ఆధ్వర్యంలో గ్రామశాఖను ఎన్నుకున్నారు కాంగ్రెస్ కమిటీ గ్రామశాఖ అధ్యక్షునిగా ఎండీ అంకూస్ ను ఎన్నుకున్నారు గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షునిగా పెండ్యాల కొండల్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా కన్నం ఎల్లయ్య, అడిశర్ల మల్లేశం, ప్రధానకార్యదర్శులుగా కన్నం రాజయ్య, గూడ స్వామి,ఈగ సాయి కుమార్ ను ఎన్నుకున్నారు. అలాగే బీసీ సెల్ గ్రామ అధ్యక్షునిగా చిల్ల మహేశ్ బాబు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షునిగా కవ్వంపల్లి సంపత్ లను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టవంతం చేసేందుకు అందరు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మహాత్మానగర్ ఉప సర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గూడ కమలాకర్,బైరి చంద్రమౌళి,పొన్నాల తిరుపతి, బోయిని వెంకటేష్, దుర్గ ప్రసాద్ అల్లాడి రఘునాథరావు, తదితరులు పాల్గొన్నారు.



# రాయికల్‌కు సబ్‌స్టేషన్ మార్చాలి

## - రామాజీపేట గ్రామస్థుల వినతి

**రాయికల్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు గురువారం విద్యుత్ శాఖ ఏడీ, ఏఈ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్ లైన్మెన్ కొరత, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వీరాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రామాజీపేటను రాయికల్ సబ్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి అరెస్టులు.. బీఆర్ఎస్‌వీ నేతలు అదుపులోకి!

**ధర్మారం, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులపై పోలీసులు నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్‌వీ నాయకులు ఆరోపించారు. ఈ క్రమంలో ధర్మారం మండల విద్యార్థి నాయకుడు దేవి వంశీకృష్ణను పోలీసులు అర్ధరాత్రి సమయంలో అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని బీఆర్ఎస్‌వీ నాయకులు ముట్టడించే అవకాశం ఉందనే సమాచారంతోనే వంశీకృష్ణను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు వారు ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును అడ్డుకునేందుకు అర్ధరాత్రి సమయంలో అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి, యువజన నాయకులను అరెస్టులు, నిర్బంధాలతో అణచివేయాలని చూడటం సరికాదని బీఆర్ఎస్‌వీ నాయకులు అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం, పోలీసులు గౌరవించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులపై నమోదు చేసిన కేసులు ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్‌వీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత హక్కులతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.




## తెలంగాణ రాష్ట్ర కళాకారుల సంఘం వేదిక సంక్షేమ సంఘం. మండల కో కన్వీనర్ గా .పురుషోత్తం అనిల్

**కాల్వ శ్రీరాంపూర్ సెప్టెంబర్ 9 (ప్రజా జ్యోతి)**

శ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేట్ గ్రామానికి చెందిన పురుషోత్తం అనిల్ ను తెలంగాణ రాష్ట్ర కళాకారుల సంఘం వేదిక కాల్వ శ్రీరాంపూర్ మండల కో కన్వీనర్ గా. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలోని. సప్తగిరి కాలనీలోని. కోదండ రామాలయంలో .తెలంగాణ రాష్ట్ర కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్ అధ్యక్షతనలో సర్వసభ్య దేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో. రాష్ట్ర .జిల్లా. మండల కమిటీలను నియమించినట్లు ఆయన వివరించారు. నా ఎన్నికలకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు



తాళ్లపల్లి సంపత్ గౌడ్ కు. రాష్ట్ర. జిల్లా. నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ .కళాకారుల అభ్యున్నతి కొరకు తన వంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ దివాళా దిశగా

## కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయకుండా ఉత్తర తెలంగాణను ఎండబెడుతున్నారు

## ఏపీకి నీటి తరలింపుపై ప్రభుత్వం ఎందుకు ప్రశ్నించడం లేదు..?

### - మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**పెద్దపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ధనిక రాష్ట్రం నుంచి తీవ్ర దివాళా దిశగా పయనిస్తోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. గురువారం పెద్దపల్లిలో సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని, కాళేశ్వరం చిన్న పిల్లర్ మరమ్మతులతో సమస్య పరిష్కరించవచ్చని అన్నారు. కేవలం కేసీఆర్‌పై కక్షసాధింపుతో ఉత్తర తెలంగాణను ఎండబెడుతున్నారని ఆరోపించారు. శ్రీశైలంలో తెలంగాణకు నీరు ఇవ్వకుండా పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా ఏపీకి నీటిని తరలిస్తున్నా ప్రభుత్వం ప్రశ్నించడం లేదని విమర్శించారు. కేసీఆర్ కిట్, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలను రద్దు చేసి, బీసీ సబ్‌ప్లాన్, 42 శాతం రిజర్వేషన్లు, గొర్రెల పంపిణీ హామీలను విస్మరించారని ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా పేరుతో



రైతులను వేధిస్తున్నారని, ప్రజలు ఎవరూ భయపడి నాయకులు, అధికారులకు పర్సంటేజీలు ఇవ్వవద్దని సూచించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా హామీల అమలు, ఉద్యోగ నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలకు మరింత సౌకర్యం





**ధర్మారం, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):**

ధర్మారం మండలంలోని రామయ్యపల్లి, దొంగతుర్తి, చామనపల్లి గ్రామాల్లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయా గ్రామాల సర్పంచులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

**రామయ్యపల్లి:**

రామయ్యపల్లి గ్రామంలో సర్పంచ్ మూల మంగ మల్లేశం గౌడ్, జీపీఓ శ్యామల దేవి, పంచాయతీ కార్యదర్శి శైలజరాణి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గట్టమ్మ, వార్డు సభ్యులు బాలయ్య, మధుకర్, శ్రీకాంత్, గాయత్రి సత్తయ్య, లక్ష్మీ ఐలయ్య, శ్రీనివాస్, సుజాత రవి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

**దొంగతుర్తి:**

దొంగతుర్తి గ్రామంలో సర్పంచ్ కొడారి మంగ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సరుకులు పొందడం మరింత సులభతరం




అవుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గొల్లె మధుకర్, బండి రాజేశ్వరి, కొమ్ము శ్రావణి పరమేష్, ఈర్ల రాజేందర్, ముక్కెర సత్తమ్మ, ఆలువాల భాగ్య, రాజేశం, ముక్కెర రజిత, ఆశాలు, జీపీఓ గంగ జమున తదితరులు పాల్గొన్నారు.

**చామనపల్లి:**

చామనపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులను స్కానర్ ద్వారా ఉపయోగించుకుని రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులను సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన కార్డు విధానం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిగుళ్ల కవిత సతీష్‌రెడ్డి, జీపీఓ ఎల్లయ్య, ఏపీఓ రవి, పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఆహార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు

## - కల్తీ స్వీట్లు ధ్వంసం.. 1,300 కిలోల ముడి పదార్థాలు స్వాధీనం

## - రెండు హోటళ్లపై చర్యలు.. ఫుడ్ లైసెన్స్ సస్పెన్షన్







**కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆహార భద్రత శాఖ అధికారులు జిల్లాలోని పలు ఆహార వ్యాపార సంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తీవ్ర ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధనల ఉల్లంఘనలు గుర్తించి పలు సంస్థలపై చర్యలు చేపట్టారు.

**బాలాజీ మ్యాజిక్ మిఠాయిలో కల్తీ స్వీట్లు**

బొపేట్‌లోని శ్రీ బాలాజీ మ్యాజిక్ మిఠాయి తయారీ సంస్థలో తనిఖీలు నిర్వహించగా తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు గుర్తించారు. కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోని స్వీట్ షాపులు, బేకరీలకు ఇక్కడి నుంచి స్వీట్లు సరఫరా అవుతున్నట్లు అధికారులు తెలిపారు. పాలతో తయారు చేయాల్సిన అజ్మీరి కలాకండ్, మిల్క్ మైసూర్ పాక్‌లను పాలు ఉపయోగించకుండా మైదాతో తయారు చేస్తున్నట్లు గుర్తించారు. సుమారు 40 కిలోల కల్తీ స్వీట్లను అక్కడికక్కడే ధ్వంసం చేసి, మరో 1,300 కిలోల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సంస్థను మూసివేసి ఫుడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సస్పెండ్ చేసేందుకు చర్యలు ప్రారంభించారు.

**కూచిపూడి రెస్టారెంట్‌కు ఇంప్రూవ్‌మెంట్ నోటీస్**

కరీంనగర్‌లోని కూచిపూడి రెస్టారెంట్‌లో వంటశాల అపరిశుభ్రంగా ఉండటంతో పాటు సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడాన్ని అధికారులు గుర్తించారు. బట్టర్ నాన్ తయారీలో ఫ్యాట్ స్ప్రెడ్ వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆహార ప్రమాణాలు, లేబులింగ్ నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో పరిశీలిస్తున్నారు. లోపాలను సరిదిద్దాలని ఆదేశిస్తూ ఇంప్రూవ్‌మెంట్ నోటీస్ జారీ చేశారు.



**లైసెన్స్ లేకుండా హోటల్ నిర్వహణ**

గీతాభవన్ చౌరస్తాలోని ఫేమస్ హోటల్ ఎలాంటి ఫుడ్ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించి అధికారులు హోటల్‌ను వెంటనే మూసివేశారు. అవసరమైన ఫుడ్ లైసెన్స్ పొందిన తర్వాతే తిరిగి కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతి ఉంటుందని అధికారులు తెలిపారు.

**మతామ్ అల్ హబీబిపై కఠిన చర్యలు**

గీతాభవన్ చౌరస్తా సమీపంలోని మతామ్ అల్ హబీబి అరేబియన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో పలు ఆహార భద్రతా ఉల్లంఘనలు బయటపడ్డాయి. గతంలో కృత్రిమ రంగులు ఉపయోగించవద్దని సూచించినప్పటికీ నిబంధనలు పాటించలేదని అధికారులు తెలిపారు. వంటశాలలో బొద్దింకలు సంచరిస్తున్నట్లు గుర్తించడంతో సుమారు 8 కిలోల హండీ రైస్‌ను అక్కడికక్కడే పారవేయించారు. తీవ్ర ఉల్లంఘనలను పరిగణనలోకి తీసుకుని సంస్థ ఫుడ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు. సంబంధిత ఆహార పదార్థాల నమూనాలను సేకరించి రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు.ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందించేందుకు ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆహార భద్రత శాఖ అధికారులు తెలిపారు.

# మార్కెట్ కమిటీ రేసులో వంగా గిరిధర్ రెడ్డి!... చైర్మన్ పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు. ... అధిష్టానం నిర్ణయం పై ఉత్కంఠత....

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రస్తుత పాలక వర్గ పదవీకాలం ఈనెల 18 తో ముగుస్తూ ఉండడంతో కొత్త పాలకవర్గంపై ఆసక్తి నెలకొంది ఈసారి జనరల్ కేటగిరికి చైర్మన్ పదవి దక్కే అవకాశం ఉన్నందున ప్రచార నేపథ్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తుంది

**.. రెండు దశాబ్దాలకు పైగా పార్టీ కి సేవ. ...పదవిపై ఆశలు.**

1997లో ఎన్ని ఎన్ ఎస్ ఏ విద్యార్థి విభాగం మండల కమిటీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన గిరిధర్ రెడ్డి 2008లో కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా 2013లో పోత్కల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉంది పార్టీలో కార్యక్రమాల్లో ఉద్యమాల్లో ధర్నాల్లో పాల్గొంటూ సీనియర్ కార్యకర్తగా గుర్తింపు పొందారు. మంత్రి పొన్న ప్రభాకర్ మంత్రి శ్రీధర్ బాబు ఆది శ్రీనివాస్ సంగీతం శ్రీనివాస్ కేకే మహేందర్ రెడ్డి బాబు తదితర నాయకులు నాయకులతో కలిసి పనిచేసిన అనుభవం కూడా ఉందితనకు కలిసి వస్తుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.

**పోటీలో మరికొందరు. ... ఎవరిని వరిస్తుందో?**

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి పై కొండాపురం శ్రీనివాస్ రెడ్డి మేడిపల్లి దేవానందం సైతం ఆశలు పెట్టుకున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ



సాగుతోంది దీంతో పదవి కోసం పోటీ ఆసక్తికరంగా మారింది .పార్టీకి దీర్ఘ కాలంగా సేవలందించిన గిరిధర్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని పలువురు కార్యకర్తలు కోరుతున్నారు నేపథ్యంలో....చివరకు మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఎవరిని వరుస్తుందని నెలకొంది?

# వేతనాలు ఇవ్వండి.. విధులకు వస్తాం

## - ఎంపీడీఓకు కంప్యూటర్ ఆపరేటర్ల వినతి

**కొడిమ్యాల,సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):**

ఐదు నెలలుగా జీతాలు అందడం లేదని, జీతాలు విడుదలయ్యే వరకు సెలవు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఇంతకాలం అప్పులు చేస్తూ విధులకు హాజరయ్యామని, ప్రస్తుతం అప్పులు చేసే పరిస్థితి కూడా లేకపోవడంతో కార్యాలయానికి రావడం కష్టంగా మారిందని తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబరు 10 నుంచి జీతాలు వచ్చేవరకు సెలవు మంజూరు చేయాలని కోరారు.వెంటనే జీతాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్శరాములు,జాస్మిని, సుమలత ఉన్నారు.



# మాట్లాడితే.. జీవితాన్ని కాపాడొచ్చు

**కొడిమ్యాల,సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):**

మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారితో మాట్లాడటం ద్వారా వారి జీవితాలను కాపాడవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ పి.తిరుపతి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో మానసిక సమస్యలను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురయ్యేవారు టెలి-మానస్ 14416కు ఫోన్ చేసి నిపుణుల సలహా పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రగతి పూర్వ విద్యార్థికి ఘన సన్మానం

**రాయికల్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థి సాంబారు మణికంఠ నీట్2026 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో ప్రభుత్వ మెడికల్ సీటు సాధించిన సందర్భంగా పాఠశాల యాజమాన్యం గురువారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా మణికంఠతో పాటు ఆయన తల్లిదండ్రులు శ్రీనివాస్, పద్మలను పాఠశాల యాజమాన్యం శాలువాలతో ఘనంగా సత్కరించింది. చిన్నప్పటి నుంచి ప్రగతి పాఠశాలలో విద్యనభ్యసించి, ఉన్నత లక్ష్యాన్ని సాధించడం పాఠశాలకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగితే ఎలాంటి ఉన్నత లక్ష్యాన్నైనా సాధించవచ్చని మణికంఠ విజయం నిరూపించిందన్నారు. ప్రగతి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. మణికంఠ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలె జయశ్రీ, అకాడమీ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



# మళ్లీ 80ల్లోకి వెళ్దాం.. ఏఐ వింటేజ్ ఫోటో ట్రెండ్ కు ఫుల్ క్రేజ్!

**కోనరావుపేట, సెప్టెంబర్.10(ప్రజా జ్యోతి)**

1980 ల నాటి జ్ఞాపకాలను మరోసారి కళ్లముందుకు తీసుకొస్తున్న వింటేజ్ ఫోటో ట్రెండ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ప్రస్తుత ఫోటోలను 1980 ల నాటి రూపంలోకి మార్చుకునే ట్రెండ్ కు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విశేష ఆదరణ లభిస్తోంది. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు ఎంతో మంది తమ రెట్రో ఫోటోలను షేర్ చేస్తున్నారు. నాటి డ్రెస్సులు, మేకప్, హెయిర్ స్టైల్స్, వాచ్‌లు, ఆభరణాలు, పాతకాలపు బ్యాక్ గ్రౌండ్స్ తో ఫోటోలకు ఏఐ సరికొత్త వింటేజ్ టచ్ ఇస్తోంది.

**భారతీయ స్టైల్ కు ప్రత్యేక ఆకర్షణ**

1980ల భారతీయ వాతావరణాన్ని ప్రతిబింబించేలా మహిళలకు రంగురంగుల చీరలు, కర్లీ హెయిర్ స్టైల్స్, పెద్ద ఆభరణాలు, పురుషులకు లూజ్ షర్టులు, హై-వేస్ట్ ట్రౌజర్లు, పెద్ద మీసాలు వంటి అంశాలను ఏఐ ఫోటోల్లో జోడిస్తున్నారు. దీంతో నాటి సినిమాలు, కుటుంబ ఆల్బమ్‌లు, స్టూడియో ఫోటోల జ్ఞాపకాలు మళ్లీ సజీవంగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం ఫిల్టర్ కాదు.. ఏకంగా 80ల కాలంలోకి! సాధారణ సెల్ఫీకి ఫిల్టర్ వేయడం కంటే, ఫోటోను చూస్తే నిజంగానే 1980ల కాలంలో తీసిన చిత్రంలా అనిపించేలా మార్చడమే ఈ



ట్రెండ్ ప్రత్యేకత. ఫిల్మ్ గ్రెయిన్, సాఫ్ట్ ఫోకస్, పాత కెమెరా నాణ్యత, వెచ్చని లైటింగ్ వంటి అంశాలతో ఫోటోలను మరింత సహజంగా రూపొందిస్తోంది. కొత్త సాంకేతికతతో పాత జ్ఞాపకాలను కలిపిన ఈ వింటేజ్ ట్రెండ్ యువతను మాత్రమే కాకుండా 80ల కాలాన్ని చూసిన వారిని ఆకట్టుకుంటోంది. దీంతో సోషల్ మీడియాలో "మళ్లీ 80ల్లోకి వెళ్దాం" అనే తరహాలో రెట్రో ఫోటోలకు క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోంది.

# రవీందర్ కుటుంబానికి 1996 బ్యాచ్ కానిస్టేబుల్ తరపున రూ.లక్ష నగదు అందజేత

**చిగురుమామిడి/సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి,**

గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో అకాల మరణం చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు చిగురుమామిడి మాజీజడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ కుటుంబానికి ఆయన సహచర 1996కానిస్టేబుల్ బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. గురువారం రవీందర్ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి,రవీందర్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవీందర్ కూతుళ్లకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బ్యాచ్ ప్రతినిధులు మాట్లాడుతూ 1996సంవత్సరంలో కానిస్టేబుల్‌గా గీకురు రవీందర్ తమతోపాటు విధుల్లో చేరారని గుర్తుచేసుకున్నారు. ట్రైనింగ్ సెంటర్ నుంచే ఆయన అద్భుతమైన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించి,మొత్తం బృందానికి నాయకత్వం వహించారని కొనియాడారు. సిరిసిల్లలో పోలీస్ ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం,తెలంగాణ స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా, ప్రజాసేవ చేయాలనే బలమైన సంకల్పంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి చిగురుమామిడి మండలంలో రెండు సార్లు సర్పంచ్‌గా, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా,చిగురుమామిడి జడ్పీటీసీగా ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. రవీందర్ హఠాన్మరణం తమకు,ఆయన కుటుంబానికి,చిగురుమామిడి మండల ప్రజలకు తీరని లోటని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గతంలో రవీందర్ ప్రోద్బలంతోనే తామంతా



ఒక సంఘంగా ఏర్పడి, ప్రతి నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఆ నిధి నుంచే గురువారం రవీందర్ కుటుంబానికి ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రవీందర్ ఇద్దరు పిల్లల చదువు, భవిష్యత్తు విషయాల్లో తమ బ్యాచ్ తరపున ఎలాంటి సహాయం చేయడానికైనా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని స్నేహితులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వావిలాల మల్లారెడ్డి,ముదిరాజ్ సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,గుండా కృష్ణకుమార్ గౌడ్, పుప్పాల శ్రీనివాస్, శంకర్ రెడ్డి, ముత్యాల బ్రహ్మయ్య, కనకయ్య, దామోదర్ రెడ్డి, కాంతారావు, సదాచారి,సుధాకర్ తదితర బ్యాచ్ సభ్యులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యం

**కొడిమ్యాల,సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):**

మండలంలోని నమిలికొండ గ్రామంలో పోషణ మాసం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. 'మన అంగన్‌వాడీ'మన బాధ్యత'పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



# కేసీఆర్ ఫామ్‌హౌస్ శుద్ధిపై కాంగ్రెస్ నిరసన,

## - దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించం

## - రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి,



**ఎండపల్లి, సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి**

దళిత నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనకు వెళ్లిన సందర్భంగా కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ ఎండపల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాజారాంపల్లి గ్రామంలోని వివేకానంద , కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దుల గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు వెళ్లిన దళిత నాయకులను అవమానించేలా ఫామ్‌హౌస్‌ను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్య అని అన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ఎవరూ అడ్డుకోలేరన్నారు. భారాస నాయకుల తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్, పలు గ్రామాల సర్పంచులు,కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న కష్టాలపై బీజేపీ మహాధర్నా

## - రుణమాఫీ, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన

**మేడిపల్లి: సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి**

రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ మేడిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడిపల్లి మండల అధ్యక్షుడు చిట్యాల సురేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి విద్యుత్ కోతలు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, దీంతో రైతులు పంటలకు నీరందించేందుకు అవస్థలు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు అన్నాడి జలపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కరండ్ల మధుకర్, సిరికొండ



శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, కాటిపల్లి జగన్‌రెడ్డి, లింగారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తౌటి తిరుపతిరెడ్డి, మామిడి ధర్మారెడ్డి, గోష్కి మధు, దొంగ రాజు, మోర్చాల మండల అధ్యక్షులు మేధారి శ్యామ్, దాసరి రఘు, రాచర్ల హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఇలమ్మకు ఘన నివాళి

## - అణచివేతకు వ్యతిరేకంగా

## ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం

**మేడిపల్లి: సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిర్భయంగా పోరాడి, భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా నిలిచిన వీరనారి చాకలి ఇలమ్మను ఆమె వర్ధంతి సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె పోరాట స్ఫూర్తిని కొనియాడారు.రైతుల హక్కుల పరిరక్షణ కోసం, అన్యాయానికి వ్యతిరేకంగా చాకలి ఇలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణచివేతను ఎదిరించి సామాన్యుల హక్కుల కోసం ధైర్యంగా నిలబడిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సామాజిక న్యాయం, సమానత్వం, గౌరవం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో చాకలి ఇలమ్మ పోషించిన పాత్రను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజు, శేఖర్, నారాయణ, గంగరాజం, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



# ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో





**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

కోరుట్ల మండలంలోని మోహన్ రావు పేట గ్రామంలో జరుగుతున్న ఫార్మ్ పాండు నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. తదనంతరం బోర్వెల్ రీఛార్జ్ ఫిట్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరంగా ఉండేలా పనులను నిర్ణీత ప్రమాణాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ నీటి నిల్వలు పెంపొందించడం ద్వారా నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు అందించడం దీని యొక్క ఉద్దేశమని బోర్వెల్ రీఛార్జ్ చేయడం ద్వారా నీటి వనరులను సంరక్షించుకోవచ్చని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు పేట సర్పంచ్ లతికా నరేష్, ఉప సర్పంచ్ జానా వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎండపల్లి కి చెందిన వ్యక్తి అదృశ్యం, ?

**ఎండపల్లి, సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి,**

మండల కేంద్రానికి చెందిన చెందిన మంతెన పోచయ్య ,బుధవారం నుంచి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 9న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎండపల్లి నుండి మంద మర్రికి వెళ్తానని చెప్పి ఆటో ఎక్కి ధర్మారం బస్టాండ్ లో దిగినట్లు పేర్కొన్నారు. అనంతరం బంధువులకు ఫోన్ చేయగా వారు రాలేదని తెలిపారు. అప్పటి నుంచి పోచయ్య ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు 9441742333, 8008498990 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.



# అన్న నా కొడుకులను చూసుకో....

## నేను తనువు చాలిస్తున్న

## బావిలో పడి వివాహిత ఆత్మహత్య



**మల్యాల,సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి :**

అన్న....నా కొడుకులను మంచిగా చూసుకో నేను చనిపోతున్న అనే మాటలు విన్న ఆ అన్న చెల్లె కోసం గాలింపు చర్యలు చేపట్టాడు. కుటుంబ సభ్యుల సహాయంతో వెతకగా ఓ వ్యవసాయ భావిలో విగత జీవిగా కనపడిన తన చెల్లి మృతదేహాన్ని చూసిన అన్న ఆర్తనాదాలు మల్యాల మండలంలో విషాదాన్ని నింపాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల గ్రామానికి చెందిన గుండేటి కవిత(34) భర్త దశరథం అనునమే గురువారం తెల్లవారుజామున తన అన్న ఆడెపు కొమురయ్యకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని తన ఇద్దరు కొడుకులను మంచిగా చూసుకోవాలని చెప్పి అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు కొమురయ్య తెలిపాడు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గలించగా సుమారు 5:30 నిమిషాలకు ముత్యంపేట శివారులోని మారుపాక విశ్వనాథ్ బావి వద్ద ఆమెకు సంబంధించిన చెప్పులు మొబైల్ ఫోన్ కనిపించాయి. బావిలో పరిశీలించగా కవిత నీటిలో కనిపించిందని పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది సహాయంతో ఆమె మృతదేహాన్ని బయటకు తీసి తదుపరి చర్యల నిమిత్తము ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కవితకు ఇద్దరు కుమారులు చిన్న కుమారుడు శశాంక్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటు ఆరోగ్య సమస్యలు కుటుంబ ఆర్థిక ఇబ్బందులు అప్పుల బాధలకు మనస్థాపానికి గురైన కవిత తన చిన్న కుమారుడిని బావిలో పడేసి అనంతరం తాను బావిలో దూకి ఉండవచ్చునని స్థానిక దర్యాప్తు ద్వారా పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. చిన్న కొడుకు శశాంక్ మృతదేహం కోసం గజఈత గాళ్ళ సహాయంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇట్టి ఘటనపై మృతురాలి అన్న ఆడెపు కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మల్యాల పోలీసుల విజ్ఞప్తి

ప్రజలు ఆర్థిక, కుటుంబ లేదా ఇతర సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురైనప్పుడు ఒంటరిగా నిర్ణయాలు తీసుకోకుండా, కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని, సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని మనో ధైర్యంతో జీవితం కొనసాగించాలని మల్యాల పోలీసులు సూచిస్తున్నారు.

# తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్.డి పట్టా అందుకున్న సుధాబోయిన వెంకటేష్

**మేడిపల్లి, సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి**

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన డా. సుధాబోయిన వెంకటేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్.డి పట్టాను విజయవంతంగా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (స్వయంప్రతిపత్తి), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధన పూర్తి చేసి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా పీహెచ్.డి కాన్వొకేషన్ పట్టాను అందుకున్నారు. డా. సుధాబోయిన వెంకటేష్ త్రి ఫేస్ గ్రిడ్ కనెక్టెడ్ మల్టీ లెవెల్ ఇన్వెర్టర్ ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్స్ అనే అంశంపై విశిష్టమైన పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను సాధించారు.ఈ పరిశోధనను ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపకుల మార్గదర్శకత్వంలో ప్రొఫెసర్ ఎం. రవికుమార్ పర్యవేక్షణలో, ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్ సహ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అధ్యాపకులు, గ్రామస్థులు, పలువురు ప్రముఖులు డా. సుధాబోయిన వెంకటేష్ కు అభినందనలు తెలియజేశారు. వెంకటేష్ సాధించిన విజయం




యువతకు, ముఖ్యంగా ఉన్నత విద్య పరిశోధన రంగాల్లో ముందుకు సాగుతున్న విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.భవిష్యత్తులో డా. సుధాబోయిన వెంకటేష్ విద్యా, పరిశోధనా, సాంకేతిక రంగాల్లో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి సమాజానికి సేవ చేయాలని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన త్రినయ్ కి ఘన సన్మానం

**మల్లాపూర్, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి:**

మండల కేంద్రానికి చెందిన శంభు తిరుపతి దంపతుల కుమారుడు త్రినయ్ కి ఎంబీబీఎస్ మొదటి రౌండ్ కౌన్సెలింగ్‌లో మంచి స్టేట్ మెరిట్ ర్యాంకు సాధించిన సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు సంఘ గంగరాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా త్రినయ్‌ను అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గంగరాజాం మాట్లాడుతూ...భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అరకంటి గంగ మల్లయ్య,వేల్పుల రాజం,జాల మల్లేష్, ఎగుర్ల సోమయ్య,తొట్ల మల్లయ్య,బింగి మల్లేష్,మధు, సంపత్,రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# కోదండ రామాలయానికి స్థలాన్ని అందించిన దాత

**మల్యాల,సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి :**



కోదండ రామస్వామి భక్తుల కోర్కెలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటున్న మల్యాల కోదండ రామాలయానికి అనేక రకాలుగా దాతలు ముందుకు వచ్చి వస్తు రూపేనా,ధన రూపేనా, స్థల రూపేనా విరాళాలు అందజేస్తున్నారు. అయితే కోదండ రామాలయానికి సమీపంలో ఉన్న 181.50 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని దేవాలయానికి కరబుజ పెద్ద నరసయ్య విరాళంగా సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించిన రిజిస్ట్రేషన్ గురువారం పూర్తి అయినట్లు తెలిపారు.

# వివిధ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

## - శాస్త్రవేత్త విజయ్ భాస్కర్





**మల్యాల,సెప్టెంబర్ 10,ప్రజా జ్యోతి :**

మల్యాల మండలంలోని రాజారాం, నూకపల్లి, పోతారం గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎ. విజయ్ భాస్కర్, ఏఓ చంద్రదీపక్, డా. సాయినాథ్ గురువారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. వరి, పత్తి, పసుపు, మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించి రైతులకు పలు సస్యరక్షణ సూచనలు చేశారు.నివారణ చర్యలువరికి కాలిబాటలు తీయాలి. కాండం తొలచు పురుగు నివారణకు లీటర్ నీటికి 2 గ్రా. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పిచికారీ చేయాలి. చౌడు పొలాల్లో నీటిని ఆరబెట్టాలి.పత్తికి రసం పీల్చే పురుగుల నివారణకు లీటర్ నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 2 మి.లీ. క్లోరోపైరిఫాస్‌కు 5 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి.మొక్కజొన్నకు కత్తెర పురుగుకు లీటర్ నీటికి 0.5 మి.లీ. స్పినోటోరమ్ పిచికారీ చేయడంతో పాటు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు పెట్టాలి.పసుపుకు ఆకుమచ్చ తెగులు నివారణకు లీటర్ నీటికి 1 మి.లీ. ప్రొపికోనజోల్ వాడాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, సర్పంచ్ గోదాదేవి, ఫ్యాక్స్ ఛైర్మన్ గంగాధర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల వద్ద విద్యుత్ భద్రతపై అవగాహన

## - నిమజ్జనం వేళ మరింత అప్రమత్తత అవసరం

## - విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలి

## - ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

**కోరుట్ల, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి**

వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రజలు, మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని వినాయక మండపాల వద్ద విద్యుత్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులకు, భక్తులకు విద్యుత్ భద్రతకు సంబంధించిన పలు ముఖ్యమైన సూచనలు చేశారు. ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద ఏర్పాటు చేసే విద్యుత్ దీపాలంకరణలు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, వైర్లు, విద్యుత్ పరికరాల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. విద్యుత్ తీగలు సక్రమంగా అమర్చేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు దారితీసే విధంగా వేలాడుతున్న లేదా దెబ్బతిన్న వైర్లను వెంటనే సరిచేయాలని తెలిపారు.

### - నిమజ్జనం సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు

వినాయక నిమజ్జనం సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు, యువత పాల్గొనే అవకాశం ఉన్నందున విద్యుత్ భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నిమజ్జనం కోసం విగ్రహాలను తరలించే సమయంలో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలకు తగలకుండా ముందుగానే మార్గాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు.విద్యుత్ తీగలకు సమీపంలో విగ్రహాలు, అలంకరణలు లేదా ఇతర సామగ్రిని ఏర్పాటు చేయకూడదని, విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని అవగాహన కల్పించారు.

### - నిర్లక్ష్యంతో ప్రమాదాలకు తావివ్వొద్దు




వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవడంతో పాటు ప్రతి ఒక్కరి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు కోరారు. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను అనుభవం లేని వ్యక్తులతో ఏర్పాటు చేయించకుండా, సంబంధిత నిపుణుల సూచనల మేరకు భద్రతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు.విద్యుత్ పరికరాలను తడిగా ఉన్న ప్రదేశాల్లో ఉంచకూడదని, వర్షం కురిసే సమయంలో విద్యుత్ పరికరాలను తాకరాదని, పిల్లలు విద్యుత్ తీగలు, పరికరాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### - ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ

ఉత్సవాల నిర్వహణలో పోలీసులు, విద్యుత్ శాఖ సిబ్బంది సూచనలను పాటిస్తూ నిర్వాహకులు సహకరించాలని అధికారులు కోరారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున విద్యుత్ భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై శ్యామ్ రాజ్, లైన్మెన్ వేణుగోపాల్ రెడ్డి, ఫోర్‌మెన్ రాజు, ఫోర్‌మెన్ సత్యనారాయణ, మున్సిపల్ తదితరులు పాల్గొని మండపాల నిర్వాహకులకు, భక్తులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు.

# జీతాలు రాక పరేషాన్

## - ఐదు నెలలుగా అందని వేతనాలు

## - ఆందోళనలో పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

**మల్లాపూర్: సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి)**

గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకోవడం అత్యంత కష్టంగా మారిందని మల్లాపూర్ మండల పరిషత్‌లో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు వాపోయారు. తమ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ గురువారం ఎంపీడీఓ శ్రీకాంత్‌ను కలిసి వారు వినతిపత్రం సమర్పించారు.సుదీర్ఘకాలంగా జీతాలు రాకపోవడంతో పిల్లల చదువులు, రోజువారీ ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.ఇన్నాళ్లు అప్పులు చేసి ఎలాగోలా నెట్టుకొచ్చామని, ఇప్పుడు ఆ అప్పులు కూడా పుట్టని దయనీయ పరిస్థితి నెలకొందని తెలిపారు. గతంలో అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా తమ సమస్యకు పరిష్కారం దొరకలేదని వారు గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల జీతాలను వెంటనే తమ ఖాతాల్లో జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.సెప్టెంబర్ 11వ తేదీలోగా తమ బకాయిలు చెల్లించకపోతే,జిల్లా స్థాయి అధికారులను ఆశ్రయించడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎంపీడీఓకు ఇచ్చిన వినతిపత్రంలో ఈ మేరకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు అనిల్, నాగమణి, వినయ్ పాల్గొన్నారు.




# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు,

**ఎండపల్లి,, సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి**

మండలంలోని గుల్లకోట లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజలు, చాకలి సంఘం ప్రతినిధులు సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.



# 22-ఏ భూముల సమస్య పరిష్కరించాలి

**కొడిమ్యాల, సెప్టెంబరు 10,(ప్రజాజ్యోతి):**

మండలంలోని 22-ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ నరేష్ కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. 24 గ్రామపంచాయతీల పరిధిలో వందల ఎకరాల భూములను 22-ఏ జాబితాలో చేర్చడంతో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అర్హత ఉన్న భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షైన్ మల్లేశం, మండల అధ్యక్షుడు బండ నరసింహారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.



# పూర్వపు విద్యార్థినికి ఘనంగా సన్మానం

**మల్లాపూర్ సెప్టెంబర్ 10, ప్రజా జ్యోతి**

మండలంలోని కొత్తదాంరాజ్ పల్లి కేరళ హై స్కూల్ లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పూర్వపు విద్యార్థికి మోతే హన్సిక ఎంబిబిఎస్ సీటు సాధించడం గర్వకారణమని సిబి అనిల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివి ప్రస్తుతం ఎంబిబిఎస్ సీటు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మంచి ఉన్నత స్థాయిలో హన్సిక ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షిన,సాయి, రాణి, శ్వేత, రజిత పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడాలి

- తప్పుల సవరణను నిబంధనల ప్రకారం చేపట్టాలి
- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాలు









**కోరుట్ల, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులను ఏ విధంగా సరిచేస్తున్నారు, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయనే అంశాలపై అధికారులను కలెక్టర్ ఆరా తీశారు.

**ఓటర్ల వివరాల సవరణలో అప్రమత్తత అవసరం**

ఓటర్ల జాబితాలో ఇంటిపేరు, ఓటరు పేరు, ఫొటో తదితర వివరాల్లో తేడాలు ఉంటే నిబంధనల ప్రకారం సరిచేయాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫొటోల్లో తప్పులు ఉంటే సరిచేయడంతో పాటు, పేరు లేదా ఇంటిపేరులో మార్పులు అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఆధారాలను పరిశీలించి సవరణలు చేపట్టాలని ఆదేశించారు.

**నోటీసులపై విచారణ ప్రక్రియ వేగవంతం చేయాలి**

ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేసిన నోటీసుల వివరాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ నిర్వహిస్తున్నారా, ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, ప్రజల స్పందన ఎలా ఉందనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని అధికారులు వివరించారు.

**ఆరోగ్య కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి**

అనంతరం కోరుట్ల పట్టణంలో నిర్మాణంలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ప్రారంభానికి అవసరమైన మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి, ఆరోగ్య కేంద్రాన్ని త్వరలో ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి సుజాత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, వైద్యులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు నెలలుగా జీతాల్లేవు..

- సామూహిక సెలవులు
- ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల నిరసన

**రాయికల్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ఐదు నెలలుగా జీతాలు అందకపోవడంతో గురువారం సామూహిక సెలవులు పెట్టి నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఆపరేటర్లు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో సామూహిక సెలవు పత్రాలను అందజేశారు.నెలల తరబడి వేతనాలు అందక కుటుంబ పోషణ, రోజువారీ ఖర్చులతో పాటు విధులకు హాజరయ్యేందుకు రాకపోకల ఖర్చులు భరించడం కూడా ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదన్నారు.పంచాయతీ పరిపాలనకు సంబంధించిన ఆన్‌లైన్ పనులతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందించే వివిధ సేవల్లో కీలకంగా పనిచేస్తున్న తమకు వేతనాలు చెల్లించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఐదు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో రాయికల్ మండల ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు దిండిగల రమేష్, చిలువేరి ప్రశాంత్‌కుమార్, గోనె కృష్ణహరి, దాసరి నరేందర్ పాల్గొన్నారు.

# కోరుట్లలో ఈఎస్ఐ సేవలు

## - కార్మికులు, ఉద్యోగులు.. వారి కుటుంబాలకు ఉచిత వైద్యం

## - ఈఎస్ఐ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

## - తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు

**కోరుట్ల, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సేవలు అందుబాటులోకి రానున్నాయని, నియోజకవర్గంలోని అర్హులైన కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు పిలుపునిచ్చారు. గురువారం కోరుట్ల పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.



### కోరుట్లకు ఈఎస్ఐ ఆసుపత్రి.. రెండోది

కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోరుట్ల నియోజక వర్గానికి ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిరిపూర్‌లో ఒక ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కాగా, కోరుట్లలో ఏర్పాటు కానున్నది రాష్ట్రంలో రెండవ ఈఎస్ఐ ఆసుపత్రి అని ఆయన పేర్కొన్నారు.ఈఎస్ఐ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం 13 మంది ఉద్యోగులను ఏర్పాటు చేసిందన్నారు. ప్రాథమిక వైద్య సేవలతో పాటు అవుట్ పేషెంట్ సేవలు, సాధారణ వైద్య పరీక్షలు, కంటి, దంత, ఈఎన్‌టీ, చర్మవ్యాధులకు సంబంధించిన వైద్య సేవలు ఉచితంగా అందుతాయని వివరించారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తారని తెలిపారు.కార్మికులు, ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈఎస్ఐ సేవలను వినియోగించుకోవచ్చని, నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జువ్వాడి నర్సింగరావు అన్నారు.

### రత్నాకర్‌రావు హయాంలోనే కోరుట్ల అభివృద్ధికి పునాది

కోరుట్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందంటే దానికి స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధి కార్యక్రమాలే ప్రధాన కారణమని నర్సింగరావు పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో కోరుట్ల నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని విమర్శించారు.స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు హయాంలో కోరుట్లలో వెటర్నరీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఫిల్టర్‌బెడ్, నూతన మున్సిపల్ భవనం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. అలాగే సుమారు 5 వేల ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికి అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జువ్వాడి నర్సింగరావు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గానికి రూ.7.51 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు.ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం ద్వారా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు.

### ఇందిరమ్మ ఇళ్లలో డబ్బులు అడిగితే చర్యలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎవరైనా లబ్ధిదారులను డబ్బులు అడిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని జువ్వాడి నర్సింగరావు సూచించారు. డబ్బులు అడిగే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.80 కోట్ల నిధులు కోరాం

కోరుట్ల నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.80 కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరినట్లు నర్సింగరావు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, త్వరలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఈఎస్ఐ ఆసుపత్రికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు

కోరుట్లలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మంత్రి వివేక్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కోరుట్ల నియోజకవర్గ ప్రజల తరపున జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం కోరుట్ల నియోజకవర్గానికి ఎంతో ప్రయోజనకరమని ఆయన పేర్కొన్నారు. ఈఎస్ఐ కార్డు కలిగిన ప్రతి అర్హుడు ఈ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.ఈ సమావేశంలో కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, మాజీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్‌రెడ్డి, నాయకులు అన్న అనిల్, పుప్పాల ప్రభాకర్,సత్యనారాయణతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలిన మోటార్లతో రైతుల రాస్తారోకో

## - 12 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్

**రాయికల్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**

వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్‌లో కోతలు విధించడాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం రాయికల్ పట్టణంలో ఆందోళన చేపట్టారు. విద్యుత్ ఉపకేంద్రం ఎదుట జగిత్యాలరాయికల్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.విద్యుత్ కోతలు, నాణ్యతలేని సరఫరా కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన మోటార్లను రహదారిపై ఉంచి నిరసన తెలిపారు. వ్యవసాయానికి రోజుకు 12 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాను ఎప్పుడు నిలిపివేస్తారో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో ముందస్తుగా సమాచారం ఇవ్వాలని కోరారు. ఆకస్మిక విద్యుత్ కోతలతో పంటలకు నీరందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నా యని తెలిపారు.సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై సుధీర్‌రావు, విద్యుత్ శాఖ జగిత్యాల రూరల్ ఏడీఈ సింధూర శర్మ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యలను ఉన్నతాధి



కారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ నెల 20లోగా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రహదారిపైనే వంటావార్పు తదితర కార్యక్రమాలతో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

# రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అల్లీపూర్ విద్యార్థినులు

**రాయికల్ సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)**



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్ జూనియర్ కళాశాలలో యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎస్. వేదశ్రీ, సీహెచ్. ఆశ్రిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పోరండ్ల కిరణ్, పీడీ కృష్ణ ప్రసాద్ తెలిపారు.రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించి, పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## - ఐబీ ఏరియాలో పాత వాటర్ ట్యాంక్ స్థానంలో కొత్త ట్యాంక్ నిర్మించాలి
## - ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి
## - ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులు వెంటనే ప్రారంభించాలి
## - 32వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. వసీం

**కోరుట్ల, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణ ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఐబీ ఏరియాలో కూల్చివేసిన పాత వాటర్ ట్యాంక్ స్థానంలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని 32వ వార్డు కౌన్సిలర్ ఎం.డి. వసీం డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ కౌన్సిలర్ లతో కలిసి ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.కోరుట్ల పట్టణంలోని ఐబీ ఏరియాలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు గతంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను కూల్చివేశారు. అయితే దాని స్థానంలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్లు తెలిపారు.

**వసీం ఆధ్వర్యంలో సమస్యపై వినతి**

ఐబీ ఏరియాతో పాటు కోరుట్ల ప్రాంతంలోని ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే స్పందించాలని కౌన్సిలర్ ఎం.డి. వసీం కోరారు. పాత వాటర్ ట్యాంక్ కూల్చివేసిన తర్వాత నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయని, నిత్యం నీటిపై ఆధారపడే కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయని తెలిపారు.ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ఈ సమస్యపై అధికారులు మరింత జాప్యం చేయకుండా నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరితగతిన ప్రారంభించాలని వసీం కోరారు.

**కోరుట్ల ప్రజల నీటి కష్టాలు తీర్చాలి**



కోరుట్ల పట్టణంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు కోరారు. ఐబీ ఏరియాలో కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు .పాత ట్యాంక్‌ను తొలగించిన వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ, నూతన ట్యాంక్ నిర్మాణం ఆలస్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేపట్టాలి**

ఐబీ ఏరియాలో కూల్చివేసిన పాత వాటర్ ట్యాంక్ స్థానంలో నూతన ట్యాంక్ నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి, కోరుట్ల ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

# పోషణతోనే ఆరోగ్యకర సమాజం నిర్మాణం

## - ఐబీ రోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో 'ఇంటింటా పోషణ సంబరాలు'
## - పౌష్టికాహారం, బాలామృతం వంటకాలపై తల్లులకు ప్రత్యేక అవగాహన
## - 32వ వార్డు కౌన్సిలర్ వసీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**కోరుట్ల, సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి**

పోషణ మాసోత్సవాల్లో భాగంగా కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో ఇంటింటా పోషణ సంబరాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి 32వ వార్డు కౌన్సిలర్ వసీం ముఖ్య అతిథిగా హాజరై తల్లులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారుల పోషకాహార భద్రతపై ప్రత్యేకంగా చర్చించారు. గర్భిణీలు, బాలింతలు, బాలికలు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని నిర్వాహకులు వివరించారు.



**- ప్రజల ఆరోగ్యంపై కౌన్సిలర్ వసీం ప్రత్యేక దృష్టి**

32వ వార్డు కౌన్సిలర్ వసీం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చన్నారు.వార్డులోని మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని కౌన్సిలర్ వసీం కోరారు. పోషకాహారంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

**- ప్రతి గర్భిణీ, బాలింత ఆరోగ్యంగా ఉండాలి సీడీపీవో కేసరి**

కార్యక్రమంలో పాల్గొన్న సహాయ శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి కేసరి మాట్లాడుతూ.. కోరుట్ల పట్టణంలోని ప్రతి గర్భిణీ, బాలింత, బాలిక ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ సంకల్పమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మహిళల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యానికి కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. కేంద్రాల్లో ప్రతిరోజూ అందించే వేడి వండిన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆమె సూచించారు.

**- ఆకట్టుకున్న బాలామృతం వంటకాల ప్రదర్శన**

కార్యక్రమంలో భాగంగా ఇంటికి తీసుకెళ్లే పోషకాహార సరఫరా మరియు బాలామృతం పిండితో తయారు చేయగల వివిధ రకాల పౌష్టికాహార వంటకాలను ప్రత్యక్షంగా తయారు చేసి తల్లులకు చూపించారు.బిడ్డల ఎదుగుదలకు, మహిళల శారీరక దృఢత్వానికి ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం ఎంతో అవసరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వివరించారు. తల్లులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి చిన్నారులకు అందించాల్సిన ఆహారం, దాని పరిమాణం, పోషక విలువలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐటీడబ్ల్యూడీ సూపర్‌వైజర్, సంయుక్త కౌన్సిలర్ అనిత, కమిటీ అధ్యక్షురాలు సుశీల, సభ్యులు జ్యోత్స్నాదేవి, నవ్యశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు బదర్ సుల్తానా, భాగ్యలక్ష్మి, శ్రావణి, కవిత, స్థానిక ఆయాలు, పెద్ద సంఖ్యలో గర్భిణీలు, బాలింతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.